ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు
జిల్లా వార్తలు
5
గురువారం 31 జూలై 2025





పులిచింతల నుంచి
భారీగా నీటి విడుదల

బిరబిరా.. కృష్ణమ్మ

బిరబిరా పరుగులతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. ఎగువ రాష్ట్రాల్లో వర్షాలతో.. శ్రీశైలం నుంచి భారీగా వరద పోటెత్తుతుండటంతో నాగార్జున సాగర్, పులిచింతల జలాశయాలతో పాటు ప్రకాశం బ్యారేజీ నిండుకుండల్లా మారాయి. సాగర్‌కు భారీగా వరదతో 26 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. లక్షల క్యూసెక్కులు సముద్రం దిశగా పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. దీంతో ప్రకాశం బ్యారేజీకి ఎగువున కృష్ణమ్మ సోయగాలతో కనువిందు చేస్తుండగా దిగువున వరద భయంతో ప్రజలను వణికిస్తోంది. నదీ తీరం వెంట గంటగంటకు వరద ఉధృతి పెరుగుతోంది. దీంతో మత్స్యకారులు తమ పడవలను ఒడ్డుకు చేర్చుకున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా జూలై నెలలో కృష్ణానది లో నీటి ప్రవాహం ఉంది. పైగా నాగార్జున సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు జలాశయాలు నిండుకుండల్లా మారడం.. భారీగా వరద నీటి విడుదలతో పలు ప్రాంతాల్లో రైతులు ముమ్మరంగా సాగు పనులు చేపట్టారు. అయితే డెల్టా పరిధిలోని లంక గ్రామాల్లోని సాగుదారులు ఆందోళన చెందుతున్నారు.



భట్టిప్రోలు : పెదలంక అరటి తోట



చింతల్లంక వద్ద కళకళలాడుతున్న కంద పైరు

- జలాశయాల గేట్ల నుంచి జాలువారుతూ..
- ఒకవైపు కనువిందు.. మరోవైపు వరద భయం
- సాగర్‌కు కొనసాగుతున్న వరద.. 26 గేట్లు ఎత్తి విడుదల
- ఇన్‌ఫ్లో 3,01,350 క్యూసెక్కులు.. ఔట్‌ఫ్లో 2,54,668 క్యూసెక్కులు
- వరద హెచ్చరికతో భయాందోళనల్లో లంక గ్రామాల రైతులు

నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి 2,82,364 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. దీంతో బుధవారం అధికారులు 26 క్రస్ట్ గేట్లను తెరిచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. 16 క్రస్ట్‌గేట్లను 5 అడుగులు, 10 క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 2,65,816 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జల విద్యుత్ కేంద్రం ద్వారా 28,826, కుడి కాల్వ ద్వారా 8144, ఎడమ కాల్వ ద్వారా 7272, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో 3,12,158 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 586.20 అడుగులు ఉంది. శ్రీశైలం నుంచి సాగర్‌కు ఇన్‌ఫ్లో 2,82,364 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

బ్యారేజీకి పెరిగిన ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లోలు

ప్రకాశం బ్యారేజ్ వద్ద గంట గంటకు ఇన్‌ఫ్లో, అ వుట్‌ఫ్లోలు పెరుగుతున్నా యి. బుధవారం రాత్రి 9.30 గం టలకు 1,21,679 క్యూసెక్కుల వరద నీరు బ్యారేజ్ వద్దకు చేరుతున్నట్లు ఇరిగేషన్‌వర్గాలు గుర్తించాయి. బ్యారేజ్‌లో నీటిమట్టం 12 అడుగుల వద్ద కొనసాగుతున్నది. 60 గేట్లను రెండు అడుగులు, 10 గేట్లను మూడు అడుగులు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కేఈ మెయిన్ కెనాల్‌కు 10,207, కేడబ్ల్యూ మెయిన్ కెనాల్‌కు 6,522, గుంటూరు ఛానల్ కు 200, సముద్రంలోకి 1,04,750,750 క్యూసెక్కుల వరదనీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లోలు గురువారం ఉదయానికి మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు చెప్పారు.



ప్రకాశం బ్యారేజి వద్ద వరద ప్రవాహం

అప్రమత్తం.. హెచ్చరికలు

ఎగువ నుంచి పెద్దఎత్తున నీటి ప్రవాహంతో నదీ పరివాహక ప్రాంతంలో ప్రజలను అప్రమత్తం చేశారు. రెవెన్యూ, పోలీసు శాఖలు ముందస్తు చర్యలు చేపట్టాయి. గజఈత గాళ్లను సిద్ధం చేశారు. పశువులను నదిలోకి దింప వద్దని రెవెన్యూ శాఖ హెచ్చరించింది. పడవలను కూడా నిషేధించారు.

అవసరమైన ప్రాంతాల్లో నది వెంట పోలీసు పహరా ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు వరద ప్రవాహంపై తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.



దాచేపల్లి : రామాపురంలో కృష్ణా నది ఒడ్డున నివాసం ఉంటున్న పల్లె కార్లను అప్రమత్తం చేస్తున్న అధికారులు

నరసరావుపేట, అచ్చంపేట, విజయపురిసౌత్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణమ్మ ఉరుకులు పరుగులతో సాగరం దిశగా ప్రవహిస్తోంది. నిండుకున్న జలాశయాల నుంచి నీటి విడుదలతో ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేస్తూ పరవళ్లు తొక్కుతోంది. నాగార్జున సాగర్, టెయిల్‌పాండ్, పులిచింతల, ప్రకాశం బ్యారేజిల నుంచి భారీగా వరద ప్రవహిస్తోంది. ఎక్కడికక్కడ అధికారులు ఇన్‌ఫ్లోను అంచనా వేసి నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ జలాశయానికి భారీగా వరద పోటెత్తుతుండటంతో మంగళవారం సాయంత్రం నుంచే అన్ని గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదలు చేస్తున్నారు. దీంతో భారీగా వస్తోన్న వరదను టెయిల్‌పాండ్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీల వద్ద కూడా అన్ని గేట్లు ఎత్తి దిగువకు పంపుతున్నారు. దీంతో గతంలో ఎన్నడూ లేనట్లుగా కృష్ణమ్మ ప్రవాహం ముందుకు సాగుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. సాగర్‌లో 586.20 అడుగుల మేర నీటి మట్టం ఉండగా ఇది 301.36 టీఎంసీలకు సమానం.

బుగ్గవాగు నుంచి నీటి విడుదల

జవహర్ కుడికాల్వ జలకళ సంతరించుకుంది. బుగ్గవాగు నుంచి కుడికాల్వకు 7,500 కూసెక్కుల నీటిని బుధవారం విడుదల చేసినట్లు జలవనరుల శాఖ ఎస్‌సీ కృష్ణ మోహన్ తెలిపారు. బుగ్గవాగు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 3.46 టీఎంసీలు కాగా 2.33 టీఎంసీలకు నీటి నిల్వ చేరింది. కుడి కాల్వ నుంచి గుంటూరు, అద్దంకి, బెల్లంకొండ, జూలకల్లు బ్రాంచ్ కాలువలకు నీటిని విడుదల చేశారు.

నిండు కుండలా పులిచింతల

వరద పోటెత్తుతుండటంతో పులిచింతల జలాశయం జలకళ సంతరించుకుంది. బుధవారం సాయంత్రానికి ప్రాజెక్టు నిండు కుండలా మారింది. డ్యాం సామర్థ్యం 45.77 టీఎంసీలకుగాను నీటి నిల్వ 41.34 టీఎంసీలకు చేరింది. పూర్తి స్థాయి నీటి మట్టం 175 అడుగులు కాగా 172.08 అడుగులకు చేరింది. గరిష్టస్థాయికి నీటి మట్టం చేరడంతో డ్యాం లోకి వచ్చిన నీటిని వచ్చినట్టుగా విడుదల చేసేందుకు (మిగతా 6వ పేజీలో)



పదవీ విరమణ శుభాకాంక్షలు
శ్రీమతి & శ్రీ రావిపాటి నాగేశ్వరరావు గారు
పంచాయతీ కార్యదర్శి (గ్రేడ్-1) -VDO
గ్రామీణ అభివృద్ధి మరియు పంచాయితీరాజ్ శాఖ, రొంపిచర్ల సచివాలయం
గత 35 సం॥లుగా పంచాయతీ కార్యదర్శిగా వృత్తినే దైవంగా భావించి విధి నిర్వహణలో విశిష్ట సేవలందించి అందరి మన్ననలు పొంది మరియు మా అభివృద్ధికి అహర్నిశలు శ్రమించి నేడు పదవీ విరమణ చేయుచున్న మా కుటుంబ రథసారథి శ్రీ రావిపాటి నాగేశ్వరరావు గారికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము. వారి భావి జీవితం సుఖసంతోషాలతో విలసిల్లాలని మనసారా ఆకాంక్షిస్తూ... మీ
భార్య : రావిపాటి రమాదేవి
కుమారుడు - కోడలు : శ్రీకాంత్ - అనూష
కుమార్తె - అల్లుడు : సంధ్య - నాగరాజు
మనుమరాళ్ళు : సన్విత, శ్రీవెన్నిక, శ్రీధ
మనుమడు : జషిత్ రామ్ మరియు బంధుమిత్రులు

మరమ్మతుల్లో.. మాయాజాలం!

- ఆ పనులకు ఒప్పందాలు లేవాయే
- సాంకేతిక అనుమతులపై సందేహాలు
- అంచనాలు ఇంకా మార్చలేదు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సాగునీటి వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం సాగునీటి సంఘాల పాలనను తీసుకొచ్చింది. మరమ్మతులు.. నీటి సరఫరాలో పారదర్శకతను పెంచాలని సంకల్పించింది. కంచే చేను మేసిన చందాన కొందరు నీటి సంఘాల ప్రతినిధులు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకు ఉదాహరణగా కాలవల మరమ్మతుల పనులు నిలిచాయి. కాంట్రాక్టర్ల ద్వారా పని చేయిస్తే ఎంతో కొంత లాభం చూసుకుంటారని, సాగు నీటి సంఘాలు అయితే తమ పనులే కాబట్టి ఎలాంటి అవకతవకలకు తావు ఉండదు అనే సదుద్దేశంలో ప్రభుత్వం కాలవల మరమ్మతు పనులు వారికి అప్పగించింది. అయితే ప్రభుత్వ లక్ష్యాలను తుంగలో తొక్కే రీతీలో కొందరు ప్రతినిధులు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అగ్రిమెంట్‌లు.. సాంకేతిక అనుమతులు లేకుండానే కోట్ల రూపాయల విలువైన పనులు చేసినట్టు సమాచారం. లింగంగుంట్ల ఓఅండ్ఎం పరిధిలో చేపట్టిన పనుల్లో అవకతవకలు జరిగాయన్న విమర్శలున్నాయి. కాలువ కట్టలపై గ్రావెల్ వేసేవిధంగా నిబంధనలకు వ్యతిరేకంగా అంచనాలు రూపొందించినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ పనుల అంశంలో , ఓ అధికారి నీటి సంఘాల ప్రతినిధులతో కుమ్మక్కు అయినట్టు ఆరోపణలున్నాయి. కాలువలకు నీరు విడుదల చేయడంతో ఈ పనులకు సంబంధించి నిధులు స్వాహా చేసేందుకు రంగం సిద్ధమైనట్టు సమాచారం. దాదాపు రూ. 65 లక్షల విలువైన పనుల అంచనాలు నిబంధనలకు విరుద్ధంగా, అదనంగా రూపొందించారన్న ప్రచారం జరుగుతోంది. కాగా ఈఈ సుబ్బారావును వివిరణ అడగ్గా పనులకు సంబంధించి అగ్రిమెంట్లు పూర్తయ్యాయని, బిల్లుల ప్రక్రియ చేపడుతున్నామని చెప్పారు.



మైనర్ కాలువ



వీధుల్లో ఎక్కడి చెత్త అక్కడే కుప్పలు కుప్పలుగా...

చెత్తశుద్ధి ఏదీ..?

- పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా పెరగని పారిశుధ్య కార్మికులు
- ఎక్కడికక్కడ పేరుకుపోతున్న వ్యర్థాలు

పిడుగురాళ్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): లక్ష మందికి పైగా జనాభా వున్న పిడుగురాళ్ల పట్టణం 33 వార్డులుగా విస్తరించి ఉంది. ఎప్పటికప్పుడు పట్టణం నలువైపులా పెరుగుతూనే ఉన్నా పారిశుధ్యం మెరుగుపడటం లేదు. పారిశుధ్య కార్మికుల సంఖ్య పర్మినెంట్, ఔట్ సోర్సింగ్‌తో కలిపి మొత్తం 120 మంది ఉండగా వారిలో 95 మందికి పైగా ఔట్‌సోర్సింగ్ కార్మికులే పనిచే స్తున్నారు. గత ఐదేళ్లుగా మున్సిపల్ కార్మికుల సంఖ్య పెంచాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేస్తున్నా అవి ఆమోదానికి నోచుకోవడం లేదు. రోజు రోజుకు పెరుగుతున్న జనాభా, శివారు ప్రాంతాలకు అనుగుణంగా పారిశుధ్య కార్మికుల సంఖ్య లేకపోవడంతో కాల్వల్లో చెత్త, వ్యర్థపదార్థాలు తొలగింపు చేయడం ప్రస్తుత కార్మికులకు కష్టంగా మారింది. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం రెండు షిఫ్ట్‌లుగా పట్టణంలోని కాల్వల్లో చెత్తను తొలగించినా తెల్లవారేసరికి మరలా అంతేచెత్త కాల్వల్లోనూ, రోడ్లపైన కుప్పలుగా కనిపిస్తుంది. అంతే కాకుండా మురుగు కాల్వలపై నాప రాళ్ళు, శ్లాబు వేస్తుండటంతో కార్మికులకు కాల్వల్లో చెత్తను తొలగించడం ఇబ్బందిగా మారింది.



జంతువుల సంరక్షణ అందరి బాధ్యత

కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : వన్య ప్రాణులు మానవ హితులని, వాటిని సంరక్షించుకోవడం ప్రజలందరి బాధ్యత అని కలెక్టర్ పీ అరుణ్ బాబు అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన వన్యప్రాణి సంరక్షణ సదస్సులో అయన మాట్లాడారు. సహజంగా పాములు, పులులు అంటే భయంతో వాటిని వేటాడటం, చంపడం జరుగుతుందన్నారు. వాస్తవానికి వన్యప్రాణులు కేవలం భయంతో మాత్రమే మనుషుల మీద దాడి చేస్తాయన్నారు. పర్యావరణంలో వివిధ రకాల ఆహార చక్రాలలో వన్య ప్రాణులు భాగస్వాములై పర్యావరణానికి, మానవాళికి మంచి చేస్తాయన్నారు. విష సర్పాలు సైతం ఎలుకలు, ఇతర కీటకాల వృద్ధి నివారించి రైతులకు మెరుగైన పంట దిగుబడి రావడంలో సహకరిస్తాయన్నారు. రైతులు ప్రమాదకర సర్పాలు, విషం లేని సర్పాల గురించి అవగాహన పెంచుకోవాలన్నారు.

సదస్సులో ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ వన్య ప్రాణుల ప్రవర్తన, వాటి సంరక్షణ గురించి వర్క్ షాప్ నిర్వహించిన అటవీ శాఖ అధికారులను అభినందించారు. పాము కాటుకు విరుగుడు మందును అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంచామన్నారు. ఎస్పీ కంచి శ్రీనివాస రావు, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, జిల్లా అటవీ అధికారి కృష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు. సదస్సులో సర్పాలతో ఏర్పాటు చేసిన లైవ్ షో వీక్షకులను ఆకట్టుకుంది. విష సర్పాలు, విషం లేని సర్పాలపై అవగాహన కల్పించారు. జీవ వైవిధ్యాన్ని కాపాడటంలో పులి అవశ్యకత గురించి తెలియజేస్తూ 'పులిని ఎందుకు సంరక్షించాలి?' అనే పోస్టర్‌ను వారు విడుదల చేశారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు, జేసీ సూరజ్

కాకాని శివాలయం హుండీ ఆదాయం రూ.64,92,250



పెదకాకాని శివాలయంలో హుండీ లెక్కిస్తున్న భక్తులు, సిబ్బంది

పెదకాకాని, జూలై 30(ఆంధ్రజ్యోతి): పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానము ఆలయ ప్రాంగణములో ఉన్న కానుకల హుండీలను తెరచి కల్యాణ మండపము నందు బుధవారం లెక్కించినట్లు ఆలయ ఉపకమిషనరు లీలాకుమార్ తెలిపారు. హుండీల లెక్కింపునకు దేవదాయశాఖ పర్యవేక్షణాధికారిగా సహాయ కమిషనర్, జ్యువెలరీ వెరిఫికేషన్ అధికారి సైదమ్మబాయి పర్యవేక్షణలో లెక్కింపు జరిగింది. దేవస్థానమునకు గడిచిన 120 రోజుల కానుకల హుండీల ద్వారా రూ.64,92,250, అన్న ప్రసాదం హుండీ ఆదాయం రూ.3,13,782, బంగారం 63.5గ్రాములు, వెండి 795గ్రాములు, విదేశీ కరెన్సీ 623 అమెరికన్ డాలర్లు ఆదాయము వచ్చిందని గోగినేని లీలాకుమార్ తెలిపారు. హుండీ లెక్కింపు నందు కార్యాలయ సిబ్బంది, కెనరా బ్యాంకు సిబ్బంది,సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

ప్రగతి పోర్టల్‌పై అవగాహన ఉండాలి

● జడ్పీ సీఈఓ వీర్ల జ్యోతి బసు



ప్రసంగిస్తున్న సీఈఓ వీర్ల జ్యోతి బసు

గుంటూరు సిటీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందితో పాటు, గ్రామ సచివాలయం లో పనిచేస్తున్న వారు కూడా ప్రగతి పోర్టల్ నిర్వహణపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా పరిషత్ సీఈఓ వీర్ల జ్యోతి బసు అన్నారు. బుధవారం గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రగతి పోర్టల్ నిర్వహణపై ఉమ్మడి జిల్లాలోని డిప్యూటీ ఎంపీడీఓలు, ఐదుగురు పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఈఓ జ్యోతి బసు మాట్లాడుతూ గ్రామ, మండలస్థాయిలో జరిగిన ప్రతి పనిని నివేదిక రూపంలో పంపితేనే ఉద్యోగులు సరిగ్గా పనిచేసినట్లు అవుతుందని అన్నారు. జిల్లాలో పర్యటించనున్న స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ సిబ్బందికి సిటిజన్ ఫీడ్ బ్యాక్ తీసుకునే విషయంలో పంచాయతీ కార్యదర్శులు సహకరించాలని సూచించారు. శిక్షణ తరగతులకు వచ్చిన ప్రతి ఒక్కరికీ డీ రవీంద్ర బాబు, డీపీఎం నాగేశ్వరరావు పూర్తిస్థాయిలో శిక్షణను ఇచ్చి, సాంకేతిక పరంగా కార్యదర్శులకు వచ్చిన పలు సందేహాలు నివృత్తి చేయడమైనది. ఈ కార్యక్రమంలో డీఎల్ పీ ఓ కే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

11 సీట్లొచ్చినా వైసీపీ బుద్ధి మారలేదు

ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



రెంటచింతల,జూలై 30 (ఆంధ్రజ్యోతి) : వైసీపీకి 11 సీట్లిచ్చి ప్రతిపక్ష హోదా లేకుండా ప్రజలు తీర్పిచ్చినా వారి బుద్ధి మారలేదని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. బుధవారం రెంటచింతలలో టీడీపీ సీనియర్ నేత మూలిరాయపరెడ్డి ఇంట జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యరపతినేని మాట్లాడుతూ అధికారంలో ఉన్నంత కాలం అక్రమంగా కేసులు పెట్టి టీడీపీ వాళ్లను వేధించడం, చంపడం, మద్యం ముసుగులో రంగునీళ్లు పోసి పేదల ప్రాణాలను హరించారని ఆరోపించారు. లిక్కర్ కేసు దోషులంతా జైళ్లకు వెళ్తున్నారు. అప్పుడే ఏమైంది.. సినిమాలో సెకండ్ ఆఫ్ చూడబోతున్నారంటూ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు హాట్ కామెంట్స్ చేశారు. గత పాలకుల హయాంలో ఐఏఎస్, ఐపీఎస్‌లు జైళ్లపాలయ్యారని అందుకు ఐపీఎస్ సీతారామాంజనేయులు ఓ ఉదాహరణగా పేర్కొన్నారు. చంద్రబాబును నంద్యాలలో అక్రమంగా అరెస్ట్ చేసిన తరువాత ఐపీఎస్ సీతారామాంజనేయులు అభ్యంతరకర భాషను ఉపయోగించారని ఈరోజున ఏమైందని ప్రశ్నించారు. మాచర్ల, గురజాల నియోజకవర్గంలో గతంలో దా రుణమైన పరిస్థితులుండేవని ఇప్పుడు ప్ర శాంతంగా ఉందన్నారు. ఈ సమావేశంలో యువనేత జూలకంటి గౌతమ్‌రెడ్డి, గొంటు ఆదిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు అబ్బిరెడ్డి,సుమంత్‌రెడ్డి,కుర్రి శివారెడ్డి,రాజారెడ్డి,రామకృష్ణ, శౌర్రెడ్డి,ఎనుముల కేశవరెడ్డి,చేర్రెడ్డి కోటిరెడ్డి, డీసీ మాజీ చైర్మన్ నరసింహారావు,తుమ్మా జోజిరెడ్డి,కావూరి నాగయ్య, లిం గాపున్నారావు,అల్లం బ్రహ్మారెడ్డి,శీలంనేని సోదరులు,అల్లం బ్రహ్మారెడ్డి,సామ్యేల్ పాల్గొన్నారు.

12 ఇసుక డంప్‌లు సీజ్



చామర్రు వద్ద పొలాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక కుప్పలను స్వాధీనం చేసుకున్న తహసీల్దార్ కే శ్రీనివాసరావు, మైనింగ్ అధికారులు

అచ్చంపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేట మండలంలో అక్రమంగా ఇసుకను డంప్ చేసిన 12 కుప్పలను గుర్తించి సీజ్ చేసినట్లు అచ్చంపేట తహసీల్దార్ కే శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం తహసీల్దార్‌తో పాటు మైనింగ్ ఫీల్డ్ అధికారి కల్యాణి, ఇతర అధికారులతో కలసి కృష్ణా నది పరిసర ప్రాంతాల గ్రామాలైన చామర్రు, అంబడిపూడి గ్రామాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక కుప్పలను గుర్తించి సీజ్ చేశారు. మండలంలో అన్ని శాఖల అధికారులతో కలసి కమిటీని ఏర్పాటు చేశారు. తహసీల్దార్, ఎంపీడీవో, రెవెన్యూ, మైనింగ్, పంచాయతీ రాజ్, పోలీసు శాఖ, ఇరిగేషన్ శాఖ అధికారులతో కలసి కమిటీని ఏర్పాటు చేయగా బుధవారం అనుమతులు లేకుండా ఉన్న కుప్పలను సీజ్ చేసి వీటిని స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. కోనూరులో మూడు స్టాక్ పాయింట్లు, అంబడిపూడి గ్రామంలో నాలుగు స్టాక్ పాయింట్లు అధికారికంగా ఏర్పాటు చేశామని, అనుమతులు తీసుకొని ఇసుకను తీసుకు వెళ్ళవచ్చని తహసీల్దార్ తెలిపారు. సీజ్ చేసిన వారిలో తహసీల్దార్‌తో పాటు మైనింగ్ ఫీల్డ్ అధికారి కల్యాణి, ఏవో వెంకటేశ్వరరావు, ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఆర్ఐ, సర్వేయర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రతి రైతు 'ఫసల్ బీమా యోజన'లో చేరాలి

ఆర్థిక సలహాదారు వైభవ్ శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న వైభవ్ శర్మ

పొన్నూరుటౌన్, జూలై30 (ఆంధ్రజ్యోతి): పంటలు సాగు చేసే ప్రతి రైతు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో చేరాలని ఫసల్ బీమా యోజన ఆర్థిక సలహాదారు వైభవ్ శర్మ కోరారు. మండల పరిధిలోని వల్లభరావుపాలెం, నండూరు గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఢిల్లీ నుంచి వైభవ్ శర్మ విచ్చేసి రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ అభిప్రాయాలను తెలియజేస్తూ పంటల బీమా పథకంలో గ్రామం యూనిట్‌గా కాకుండా రైతుకు వ్యక్తిగతంగా లబ్ధి చేకూరే విధంగా చేయాలని కోరారు. పంట కోత అనంతరం 15 రోజుల వరకు పోస్ట్ హార్వెస్ట్ నష్టానికి కూడా బీమాలో వర్తింపచేయాలని విజ్ఞప్తి చేశారు. రైతులు కూడా పంట రుణాలు పొందితే పంటల బీమా వర్తింప చేయాలన్నారు. రైతులు తెలియచెప్పిన అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా గ్రామంలో పంట పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ సీహెచ్ తిరుమల దేవి, ఏడీఏ వీ రామ కోటేశ్వరి, ఏవో ఆర్ వెంకటేశ్వరరావు, విస్తరణ అధికారి ఐ శ్రీకాంత్, డీ యామిని తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చర్యలు

● సత్తెనపల్లి డీఎస్పీ ఎం హనుమంతరావు ● కుంకలగుంటను జల్లెడ పట్టిన పోలీసులు



కార్డెన్ సెర్చ్‌లో స్వాధీనం చేసుకున్న బైక్‌లు, మారణాయుధాలతో సత్తెనపల్లి డీఎస్పీ ఎం హనుమంతరావు

నకరికల్లు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు సత్తెనపల్లి డీఎస్పీ ఎం హనుమంతరావు తెలిపారు. బుధవారం తెల్లవారుజామున నకరికల్లు మండలం కుంకలగుంట గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కుంకలగుంటను పోలీసులు జల్లెడ పట్టారు. సరైన పత్రాలు లేని 36 బైక్‌లను, గొడ్డళ్ళను, కత్తులను పోలీసులు సీజ్ చేశారు. కుంకలగుంటలో గత ఏడాది వినాయక చవితి ఉత్సవాల సమయంలో శాంతి భద్రతల సమస్య తలెత్తిందని, అలాంటి సమస్య తిరిగి తలెత్తకుండా ఉండేందుకు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు కుంకలగుంటలో కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు డీఎస్పీ తెలిపారు. కుంకలగుంటలో కులాల పరంగా విడిపోయి ఉన్నట్లు చెప్పారు. త్వరలోనే రాజకీయ నేతలతో సమావేశం నిర్వహిస్తామన్నారు. రానున్న వినాయక చవితి సమయంలో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ ఎం హనుమంతరావు తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలో వందలాది మంది పోలీసులతో ఈ కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐలు పీ కిరణ్, పీ సురేష్, నకరికల్లు ఎస్ఐ సీహెచ్ సురేష్‌తో పాటు పలువురు సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బిరబిరా.. కృష్ణమ్మ

(5వ పేజీ తరువాయి)

జలవనరుల శాఖ చర్యలు చేపట్టింది. గంట గంటకు సాగర్ నుంచి ప్రవాహం పెరుగుతుందని పులిచింతల ప్రాజెక్టు డీఈ వెంకట్ తెలిపారు. తాడువాయి వద్ద మత్స్యకారుల పడవలు ఒడ్డుకు చేరాయి. నదీ తీరాల గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసినట్లు తహసీల్దారు శ్రీనివాసరావు తెలిపారు.

లంకలకు పొంచి ఉన్న ముప్పు..

కృష్ణానదికి వరద నీరు పోటెత్తుతుండటంతో లంక గ్రామాలకు ముప్పు పొంచి ఉంది. గత ఏడాది భారీ వరదల నుంచి తేరుకున్న రైతులను ఈ ఏడాది కూడా వరద భయం వెంటాడుతోంది. కొల్లిపర, కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని నదీ పరివాహక ప్రాంతంలో సుమారు 35 గ్రామాల్లో 20 వేల ఎకరాల్లో వాణిజ్య పంటలు సాగు చేస్తున్న రైతులు వరద నుంచి రక్షించాలని కృష్ణమ్మను వేడుకుంటున్నారు. బుధవారం రాత్రి 3 లక్షల పైచిలుకు క్యూసెక్కులు విడుదల చేస్తారని అధికారులు ప్రకటించడంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

బాపట్ల కలెక్టర్ సమీక్ష

కృష్ణానది వరద నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయడంతో పాటు అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. బుధవారం కొల్లూరులోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది 11.43 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా ప్రాణనష్టం జరగకుండా పని చేసినట్లు ఇప్పుడు కూడా యంత్రాంగం పని చేయాలన్నారు. కరకట్ట బలహీనంగా ఉన్న చోట్ల ఇసుక బస్తాలతో పటిష్టపరచాలన్నారు. బియ్యం, నిత్యావసరాలు, పడవలు, ట్రాక్టర్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పునరావాస కేంద్రాల్లో అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల్లోని కొన్ని ప్రాంతాలు వరద ప్రభావితం అవుతాయన్నారు. గతం కంటే మెరుగుగా అధికారులు పని చేసి ప్రాణనష్టం జరగకుండా చూడాలన్నారు.

- సత్రశాలలోని టెయిల్‌పాండ్‌లో 14 గేట్ల ద్వారా 2,94,109 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎగువన సాగర్ నుంచి 2 లక్షల 91 వేల క్యూసెక్కుల నీరు వస్తుండగా రిజర్వాయర్‌లో 6.337 టీఎంసీల నీరుంది. 74.39 మీటర్లు అంటే 247.70 అడుగులకు ఇది సమానం.
- బుధవారం సాయంత్రం పులిచింతల ప్రాజెక్టులో 41.58 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఎగువ నుంచి 3,01,167 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది. వీటిలో విద్యుత్ ఉత్పత్తి ద్వారా 13,600 క్యూసెక్కులు, 12 గేట్ల ద్వారా 2,84,561 క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులను విడుదల అవుతుంది.

జంట హత్య కేసులో నిందితుల అరెస్టు

నరసరావుపేట లీగల్, జూలై 30, (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఈ నెల 23న బెంగళూరుకు చెందిన తండ్రీకుమారులైన రియల్టర్లు వీరస్వామిరెడ్డి, ప్రశాంత్‌ల హత్య కేసులో నిందితులను నరసరావుపేట మొదటి పట్టణ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆర్థిక వివాదాల నేపథ్యంలో తండ్రీకుమారులను కిడ్నాప్ చేసి సంతమాగులూరు సమీపంలో సంతమాగులూరు గ్రామానికి చెందిన బాదం మాధవరెడ్డి, గడ్డం రఘురాం రెడ్డి, గడ్డం నాగిరెడ్డి, గడ్డం గోపిరెడ్డి, గడ్డం ఇంద్రసేనారెడ్డిల హతమార్చినట్లు కేసు నమోదైన విషయం తెలిసిందే. సీఐలు ఎంవీ చరణ్, హైమారావు, బి.సుబ్బానాయుడు, పి.రామకృష్ణల నేతృత్వంలో ఎస్ఐలు హరిబాబు, వంశీకృష్ణ ప్రత్యేక బృందాలుగా ముంబయి వెళ్లి నిందితులను అరెస్టు చేశారు. వీరిని బుధవారం నరసరావుపేటలోని మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయ అధికారి ఆవుల సలోమి ఎదుట హాజరు పరుచగా రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసులో పోలీసులు ఇప్పటివరకు మొత్తం 13 మందిని నిందితులుగా పేర్కొన్నారు. గతంలోనే అనిల్ రెడ్డిని అరెస్టు చేశారు. ప్రస్తుతం ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. మొత్తం ఆరుగురు నిందితులను మూడు రోజుల వ్యవధిలోనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రగతి

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఎంతో అనుభవం కలిగిన వ్యక్తి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని, ఆయన సారథ్యంలో రాష్ట్రం ప్రగతి వైపు పరుగులు పెడుతుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామంలో బుధవారం జరిగిన గుడిపూడి పీఏసీఎస్ పాలకవర్గ ప్రమాణ స్వీకారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో, విడి పోయిన రాష్ట్రంలో అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా పని చేసిన గొప్ప వ్యక్తి చంద్రబాబు అన్నారు. 2019 - 2024 మధ్య రాష్ట్రంలో అరాచక రాక్షస పాలన జరిగిందని, వైసీపీ అధినేత జగన్ దగ్గర నుంచి గ్రామ స్థాయి వైసీపీ నాయకులు కూడా రాక్షస మనస్తత్వం కలిగి ఉన్నారన్నారు. అందుకే వైసీపీని గత ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు అవమానకరంగా ఇంటికి పంపినా నేటికి సిగ్గు రాలేదన్నారు. దీనికి నిదర్శనమే ఇటీవల సత్తెనపల్లి మండలం రెంటపాళ్ళలో జరిగిన జగన్ పర్యటనే నిదర్శనం అన్నారు. ఇలాంటి పార్టీ 2029 ఎన్నికల్లో అడ్రస్ ఉండదని తెలిపారు.

ఏపీ మాజీ ప్రిన్సిపల్ సెక్రెటరి గిరిజాశంకర్‌కు పీహెచ్‌డీ



పెదకాకాని, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రూరల్ డెవలప్మెంట్‌లో విశ్రాంత ఐఏఎస్ అధికారి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రిన్సిపల్ సెక్రెటరి ఎం గిరిజాశంకర్‌కు పీహెచ్‌డీ డిగ్రీని ప్రదానం చేసింది. ఏఎన్‌యూ రూరల్ డెవలప్మెంట్ విభాగం ఆచార్యులు వి.దివ్యతేజోమూర్తి పర్యవేక్షణలో గిరిజాశంకర్ "రోల్ ఆఫ్ నాచురల్ రిసోర్సెస్ మేనేజ్మెంట్ ఆన్ రూరల్ లైవ్లీహుడ్(ఏ స్టడీ ఆఫ్ వైఎస్సార్ కడప డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం)"అనే అంశంపై పరిశోధనలు పూర్తి చేశారని పరిశోధనా విభాగం సమన్వయకర్త డాక్టర్ పీ సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల గిరిజాశంకర్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ప్రిన్సిపల్ సెక్రటరి హోదాలో ఉద్యోగ విరమణ చేశారు.

జోన్ 3 పరిధిలో మరో 18 మందికి ఇన్‌చార్జి ఎంఈఓలుగా బాధ్యతలు

గుంటూరు (విద్య), జూలై 30 (ఆంధ్రజ్యోతి): (ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు) జిల్లాల పరిధిలోని మండలాల్లో ఖాళీగా ఉన్న ఎంఈఓ పోస్టులను ఇన్‌చార్జిలతో (ఎఫ్ఏసీ) భర్తీ చేస్తూ ఆర్జేడీ లింగేశ్వర రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో తుళ్లూరు ఎంఈఓగా ఎస్ అజయ్ కుమార్, పొన్నూరుకు డీ రాజు, మంగళగిరికి ఉషాకుమారి, అమరావతికి కేఎస్ ఎన్ ప్రసాద్, కారంపూడికి జే అనిల్‌కుమార్, క్రోసూరుకు జీ కృష్ణ, ముప్పాళ్లకు పీ సుధారాణి, నూజెండ్లకు కే సత్యనారాయణ, చుండూరుకు జే సురేష్‌బాబులను నియమించారు. ప్రకాశం జిల్లాకు సంబంధించి బెస్తవారిపేట ఎం ఈఓగా మధుసూదన్ రెడ్డి, గిద్దలూరుకు ఎంవీ భాస్కర్‌లను నియమించారు. నెల్లూరు జిల్లాకు సంబంధించి కందుకూరు ఎంఈఓగా ఎంఎంకే శర్మ, ఒలేటివా రిపాలెంకు పీ మాల్యాద్రి రెడ్డి, గుడ్లూరుకు బీ హరేరామ్, దుత్తలూరుకు ఎన్ పద్మనాభరావు, ఉదయగిరికి టీ వెంకటేశ్వర్లు, చీరాలకు కే కొండయ్య, సైదాపురానికి బాలసుబ్రమణ్యంను ఇన్చార్జి ఎంఈఓలుగా నియమించారు.

తండ్రిని చంపిన తనయుడుకి జీవిత ఖైదు

నరసరావుపేట లీగల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఆస్తి ఇవ్వలేదని అక్కసుతో తండ్రిని దారుణంగా హతమార్చినట్లు నేరం రుజువు కావడంతో నిందితుడు నాదెండ్ల మండలం బుక్కాపురం గ్రామానికి చెందిన గొట్టిపాటి కాంతారావుకు జీవిత ఖైదు రూ. 10,000 జరిమానా విధిస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి నేతి సత్యశ్రీ బుధవారం తీర్పు వెలువరించారు. మృతుడు రోశయ్యకు రెండు పెళ్లిళ్ల అయ్యాయి. రోశయ్యకు మూడు ఎకరాల పొలం ఉంది. మొదటి భార్య కుమారునికి ఒక ఎకరం, రెండో భార్య కుమారుడైన నిందితుడు కాంతారావుకు ఒక ఎకరం పొలం పంచి ఇచ్చాడు. మిగిలిన ఎకరం పొలం తన కోసం ఉంచుకున్నాడు. దుర్వ్యసనాలకు లోనైన నిందితుడు కాంతారావు ఆ ఎకరం కూడా తన పేరున రాయమని మృతుడు రోశయ్యను వేధిస్తుండేవాడు. ఈ నేపథ్యంలో తండ్రి రోశయ్యను 2019 మే 26న బంధువుల శుభకార్యానికని మోటార్ సైకిల్‌పై ఎక్కించుకొని వెళ్లి నాదెండ్ల ఎండుగుమ్ పాలెం మధ్యగల నక్కవాగు వద్ద గొంతు కోసి దారుణంగా హతమార్చాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన చిలకలూరిపేట రూరల్ పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో పై విధంగా కోర్టు తీర్పు వెలువడించింది.

వైసీపీ నుంచి క్రైస్తవులను కాపాడాలి

● ప్రొఫెసర్ జోసఫ్ మోసిగంటి

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), జూలై 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుల నుంచి రాష్ట్రంలో క్రైస్తవులను కాపాడాలని జీసస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ జోసఫ్ మోసిగంటి బుధవారం కోరారు. వైసీపీ ప్రభుత్వంలో క్రైస్తవ సమాజానికి ఏమి చేయకపోవడం వలన క్రైస్తవ సమాజం చంద్రబాబు వైపు మొగ్గు చూపిందన్నారు. 25 శాతం ఉన్న క్రైస్తవ సమాజాన్ని తమ వైపు నిలబెట్టుకోవడానికి వైసీపీ నాయకులు కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు. క్రైస్తవేతరుల చేత చర్చిల మీద కంప్లైంట్లు ఇప్పించి చర్చికి పర్మిషన్ లేదని.. మైకులు పెడుతున్నారనే కారణాలు చూపించి కొన్ని చోట్ల చర్చిలను మూసి వేయిస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో చర్చిల మీద దాడులు పెరిగిపోతున్నాయి అన్నట్లుగా ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు కూడా ఈ విషయాలను గమనించాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధ్యాయులకు త్వరలో మూల్యాంకన నిధులు

ఇప్పటికే రూ.65 లక్షలు సీఎఫ్ఎంఎస్ ఖాతాలకు: డీఈఓ సీవీ రేణుక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు (విద్య) జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల మూల్యాంకన నిధులు త్వరలో సీఎఫ్ఎంఎస్ ద్వారా చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఈఓ సీవీ రేణుక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రజ్యోతిలో బుధ వారం ప్రచురితమైన "మూల్యాంకన వేతనం మరిచారు" శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆమె స్పందిస్తూ ఇప్పటికే రూ. 65 లక్షల నిధులు మంజూరు అ య్యాయని వీటిని సీఎఫ్ఎంఎస్‌కు పంపించినట్లు వివరించారు. విడతలవారీగా ఉపాధ్యాయుల ఖాతాలకు ఆ నిధులు జమ చేస్తామని తెలిపారు. మూల్యాం కనానికి సంబంధించి అన్ని బకాయిల చెల్లింపులు త్వరలో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

చికిత్సపొందుతూ మరో యువకుడు మృతి

యడ్లపాడు, జూలై 30(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకులలో మరో యువకుడు మృతిచెందాడు. ఈ నెల 27న పదహారో నంబరు జాతీయరహదారి తిమ్మాపురం కొత్త బైపాస్ మార్గంలోని బ్రిడ్జిపై బుల్లెట్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో మేడికొండూరు మండలం పాలడుగు గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు దొప్పలపూడి హనుమకృష్ణశాస్త్రి, బిరుదు చందు, రాజ్‌పుత్ దిలీప్‌కుమార్‌లు తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. గాయపడిన వారిలో దొప్పలపూడి హనుమ కృష్ణశాస్త్రి(25) సోమవారం మృతిచెందిన విషయం విధితమే. కాగా మరో యువకుడు బిరుదు చందు(23) మంగళవారం రాత్రి చికిత్సపొందుతూ మృతి చెందాడు. చందు డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగం కోసం పరీక్షలకు సిద్ధం అవుతూ కోచింగ్ తీసుకుంటున్నాడు. చందు మృతదేహానికి బుధవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు. కాగా రాజ్‌పుత్ దిలీప్‌కుమార్‌కు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స కొనసాగుతోందని ఎస్ఐ వెల్లడించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	116, 124, 135
చికెన్ విత్ స్కిన్(కిలో)	220.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	230.00

40,869 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 42,379 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 40,869 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 9,818 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9600	11000
334	9500	13200	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13300	334	9500	12600
273	----	----	నెంబరు. 5	10000	13400
341	10000	13500	273	----	----
4884	----	----	341	10000	13600
సూపర్ 10	----	----	4884	10000	12700
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14000	తేజ	10000	13800
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	12300
బ్యాడిగి	10000	12600	దేవనూరు డీలక్స్	10000	12700
దేవనూరు డీలక్స్	10000	12500	తాలుకాయలు	4500	7000

ప్రతి చివరి ఎకరానికి నీరందిస్తాం: డీసీ చైర్మన్

కారంపూడి, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రతి చివరి ఎకరానికి నీరందిస్తామని డీసీ చైర్మన్-4 పంగులూరి అంజయ్య అన్నారు. బుధవారం మండలంలోని రామాపురం మేజర్‌కు జలహారతి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పెద కాలువ నుంచి రామాపురం మేజర్ కాలువ గుండా దిగువకు నీళ్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నడూలేని విధంగా మేజర్‌కాలువల పూడికను తీశామన్నారు. గత ప్రభుత్వంలో ప్రజలకు చివరి ఎకరానికి నీరు అందక రైతులు ఇబ్బంది పడ్డారన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.


సబ్ జైలును తనిఖీ చేసిన న్యాయమూర్తి విజయ కుమార్‌రెడ్డి

సత్ ప్రవర్తనతో మెలగాలి

● న్యాయమూర్తి విజయ కుమార్‌రెడ్డి

సత్తెనపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఖైదీలు సత్ ప్రవర్తనతో మెలగాలని సీనియర్ సివిల్ జడ్జి విజయ కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సబ్ జైలును బుధవారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. సబ్ జైలులోని పరిసరాలను ఆయన పరిశీలించారు. ముద్దాయిలతో మాట్లాడి వారికి అందుతున్న ఆహార పదార్థాల గురించి, వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ఏ ఏ కేసుల్లో ముద్దాయిలుగా ఉన్నారు? అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదిని నియమించుకొనే స్థోమత లేని వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో న్యాయవాది బీఎల్ కోటేశ్వరరావు, సబ్ జైలు సూపరింటెండెంట్ వెంకట రత్నం ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ

సమస్యలను పరిష్కరించాలి

● కౌన్సిలర్ల డిమాండ్

దాచేపల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీలో రోజురోజుకు పెరిగిపోతున్న సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ తీసుకోవాలని కౌన్సిలర్లు కోరారు. బుధవారం దాచేపల్లి నగర పంచాయతీ, సచివాలయం-1లో నగర పంచాయతీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ అధ్యక్షత వహించారు. సమావేశంలో కమిషనర్ వెంకటేశ్వర్లు పలు అంశాలను సభ్యులకు తెలిపారు. 14వ వార్డు కౌన్సిలర్ షేక్ షరీఫ్ మాట్లాడుతూ నాగులేరుపై చెక్‌డ్యామ్ నిర్మించాలని, పెన్సింగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏర్పాటు చేయాలని కోరారు. రైల్వే స్టేషన్ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న రహదారికి రెండు వైపులా డ్రెయినేజ్ నిర్మించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి వేగవంతంగా పని చేయాలని చైర్‌పర్సన్ సుబ్బమ్మ కోరారు.

ఆంధ్రజ్యోతి కథనాలపై తహసీల్దార్ విచారణ

దాచేపల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): తంగెడ జడ్పీ హైస్కూల్ వెనుక వైపున్న భూములు కొంతమంది ఆక్రమించారని, ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నారని పత్రికల్లో వచ్చిన కథనాలను ఆధారంగా తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐ శరత్, గ్రామ సర్వేయర్లు, సచివాలయ సిబ్బందితో కలసి పరిశీలించారు. హైస్కూల్ వెనుక వైపు ఉన్న బీడు భూములు 1188 సర్వే నెంబరులో ఉన్నాయి. ఆర్‌ఎస్‌ఆర్ ప్రకారం ఈ సర్వే నెంబరులో 7.64 ఎకరాలు ఉంది. కాని ఆన్‌లైన్‌లో 12.60 ఎకరాలుగా నమోదైంది. అదనంగా వచ్చిన 4.99 ఎకరాల భూమి ఎలా నమోదైందని అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ భూమిని అదనంగా నమోదుచేసుకున్న వారికి నోటీసులు జారీచేశామన్నారు. అనంతరం తంగెడలో ప్రతి నెల 30వ తేదీన నిర్వహించే పౌరహక్కుల దినోత్సవంలో పాల్గొన్నారు. చిన్నారులకు బాల్య వివాహాలు చేయవద్దని తెలిపారు.

ప్రభుత్వ ఆదాయం పెంచాలి

పిడుగురాళ్ల, జూలై 30(ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల జడ్పీ కాంప్లెక్స్‌ను బుధవారం జడ్పీ సీఈవో జ్యోతిబషు పరిశీలించారు. కాంప్లెక్స్ గదుల అద్దె బకాయిల వివరాలు తెలుసుకోవడంతో పాటు వాటిని చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గదుల లీజుదారులతో సమావేశం నిర్వహించి ప్రతినెల అద్దె చెల్లింపు జరిగేలా చూడాలన్నారు. అనంతరం గుత్తికొండ సమీపంలో వున్న జడ్పీ భూములను కొన్నేళ్లుగా ఆదాయం లేకుండానే కొందరు భూమిసాగు చేసుకుంటున్నారని, ఈ ఏడాది ఎట్టి పరిస్థితుల్లోనూ కౌలు నిర్ణయించి ఆదాయం పెంచేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. గుత్తికొండ సచివాలయంలో పీ-4పై గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దయాకర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నీటిని కాచి వడపోసి తాగండి

అమరావతి : కృష్ణానదిలో వరదనీరు ప్రవహించడం వలన పంచాయతీలు సరఫరా చేసే మంచినీరు ఫిల్టర్ చేసినప్పటికి రంగుమారి వస్తున్నాయని వాటిని కాచి వడపోసుకుని మంచి నీరుగా వినియోగించుకోవాలని అమరావతి, ధరణికోట పంచాయతీ కార్యదర్శులు శివరావు, వెంకటాద్రి తెలిపారు. పంచాయతీ సరఫరా చేసే నీటిపై అపోహలు వద్దని వాటిని టెస్ట్ చేయడం జరిగిందని వారు తెలిపారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి

బెల్లంకొండ, జూలై 30(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మండల కోర్‌కమిటీ సభ్యుడు, టీడీపీ సీనియర్ నాయకుడు వెన్నా సీతారామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నాగిరెడ్డిపాలెంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గడపగడపకు వెళ్ళి సంవత్సర కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో తిప్పిరెడ్డి కిచ్చారెడ్డి, వీరారెడ్డి, రామకృష్ణ, బద్దూరి సుబ్బారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఎరుకలయ్య పాల్గొన్నారు.

సుపరిపాలనలో.. టాప్-10లో పెదకూరపాడు

పెదకూరపాడు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం రాష్ట్రంలో టాప్-10లో పెదకూరపాడు నియోజకవర్గం ఉందని నియోజకవర్గ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ క్యాంపు కార్యాలయ ప్రతినిధి బుధవారం తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ఎమ్మెల్యే ఆదేశాలతో పూర్తిచేసినట్టు వివరించారు. అందుకు కృషిచేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

కార్యకర్తల బలిదానాలను వృథా కానివ్వం

● కంటతడిపెట్టిన ఎమ్మెల్యే యరపతినేని

● శేషగిరిరావుకు ఘన నివాళులు

రెంటచింతల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల బలిదానాలను వృథాకానివ్వం..వస్తులుంటూ కూడా టీడీపీ జెండాను మోశారు. ఎన్నో అవమానాలకు గురయ్యారు.పార్టీలో చురుకుగా పనిచేసే వారందరి మీద అక్రమకేసులు బనాయించి జైళ్లల్లో వేయించారు. కార్యకర్తల ధైర్యం మొక్కవోని ఆత్మవిశ్వాసంతో టీడీపీ అధికారంలోకి వచ్చింది. మీరే మాకు ఆస్తిపాస్తులంటూ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఉద్వేగభరితంగా అన్నారు. బుధవారం పాలువాయిగేట్‌లో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి సతీమణి శోభారాణి, కుమారుడు గౌతమ్‌రెడ్డిలతో కలిసి పర్యటించి ఇటీవల మృతిచెందిన నంబూరి శేషగిరిరావు సతీమణి కృష్ణవేణిని ఓదార్చారు. తొలుత శేషగిరిరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అప్పటి వైసీపీ ఎమ్మెల్యే పీఆర్కే గూండాలు విచక్షణారహితంగా దాడి చేస్తే తలపగిలి రక్తం దారలై కారుతున్నా వెనుకంజవేయని శేషగిరిరావు పార్టీకోసం ప్రాణాలను పణంగా పెట్టారని అకస్మాత్తుగా మృతి చెందడం బాధాకరమని చెమర్చిన కళ్లతో యరపతినేని పేర్కొన్నారు. యువనేత గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ బ్రహ్మరెడ్డి గెలుపులో శేషగిరిరావు వీరోచితంగా పోరాడారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పి.కాంతారావు, పాతూరి శివనాగు, డీసీ చైర్మన్లు చావా రామారావు,యాగంటి రామారావు, పంగులూరి అంజయ్య, పోట్ల నరసింహారావు, సాంబయ్య, అర్జున్, బెల్లంకొండ శ్రీను, నరేంద్ర, మంచికల్లు శివ, బి.రామకృష్ణ, సాయి, కోటి, పున్నారావు, వై.కేశవరెడ్డి, సొసైటీ చైర్మన్లు మట్టయ్య, అల్లం నాగలక్ష్మి, మల్లారెడ్డి, శౌంతిరెడ్డి నర్సిరెడ్డి, కాపూరి నాగయ్యనాళం పెదబాబు, నల్లబిరుదు నరసింహారావు, గొట్టం శ్రీనివాసరెడ్డి, ప్రభురాజ్, మల్లయ్య, గాడిపర్తి అజయ్, పూర్ణయ్య, లింగా పున్నారావు, గుండాల శ్రీను, రాజబోయిన మధు, మందలపు రామకృష్ణ తదితరులున్నారు.


మృతుడు శేషగిరి సతీమణి కృష్ణవేణిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని, జూలకంటి గౌతమ్‌రెడ్డి

శేషగిరిరావు మృతి పార్టీకి తీరనిలోటు

కారంపూడి, జూలై 30(ఆంధ్రజ్యోతి): నంబూరు శేషగిరిరావు మృతి పార్టీకి తీరనిలోటని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య అన్నారు. బుధవారం కారంపూడిలో శేషగిరిరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బొల్నేడి శ్రీనివాసరావు, రాము, పూర్ణయ్య, కృష్ణ, సత్యం, బాలకృష్ణ, మస్తాన్‌జాని, శేషగిరి, కోటేశ్వరరావు, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఓ మొక్క నాటాలి

● ప్రభుత్వ సలహాదారు అంకారావు


పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్న కొమెర అంకారావు

పిడుగురాళ్ల, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న ప్రతి విద్యార్థి ఓ మొక్కను నాటి పెంచేలా బాధ్యత తీసుకోవాలని రాష్ట్ర పర్యావరణ ప్రభుత్వ సలహాదారు కొమెర అంకారావు అలియాజ్ జాజి తెలిపారు. బుధవారం జానపాడు జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు మొక్కలను పెంచడం ఎలా.. పర్యావరణంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు మొక్కల పెంపకానికి, పర్యావరణానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని గుర్తుచేస్తూ, ప్రతి విద్యార్థి పాఠశాలలో చేరినప్పుడే ఓ మొక్కను నాటి పెంచేలా బాధ్యత తీసుకుంటే పాఠశాల విడిచి వెళ్లే సమయానికి మొక్క చెట్టు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం దయాకర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సహకార స్ఫూర్తికి అనుగుణంగా పనిచేయాలి

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): సహకార స్ఫూర్తికి అనుగుణంగా చైర్మన్, డైరెక్టర్లు పనిచేస్తూ సహకార సంఘాన్ని లాభాల బాట పట్టించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని గుడిపూడి పీఏసీఎస్ పాలకవర్గ ప్రమాణస్వీకార మహోత్సవం బుధవారం కోలాహలంగా జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ పాలకవర్గం రైతులకు సకాలంలో రుణాలు, పురుగుమందులు అందిస్తూ వారి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రైతులతో మమేకమవ్వాలన్నారు. రుణాలు ఇవ్వటమే కాకుండా వాటి రికవరీపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం చైర్మన్ గద్దె అప్పారావు, డైరెక్టర్లు గుంటుపల్లి బొల్లయ్య, పురం మరియదాసుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా చైర్మన్ అప్పారావు మాట్లాడుతూ తనకు పదవి ఇచ్చిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ నమ్మకాన్ని వమ్ము చేయకుండా రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తానన్నారు. నూతన పాలకవర్గానికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను పాలకవర్గం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో కొనకంచి పుల్లారావు, గద్దె ఆంజనేయులు, లగడపాటి గజానన, బండారుపల్లి సాంబశివరావు, కొర్లకుంట రమేష్ బాబు, కొనకంచి అరుణాచలేశ్వరరావు, నందిగం శ్రీనివాసరావు, మార్కెట్ యార్డు చైర్మన్ కోమటినేని శోభారాణి, శాఖమూరి శ్రీనివాసరావు, కొనికినేని సత్యనారాయణ, మక్కపాటి భాస్కర్, నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, యర్ర వెంకటేశ్వరరావు, మక్కపాటి రామచంద్రరావు, గద్దె శ్రీనివాస్, షేక్‌రంజాన్, అలపర్తి గోపాలరావు, మండడి బాబు, మండడి వెంకటశివ నాగరాజు, మండడపు సాంబశివరావు, పాటిబండ్ల పూర్ణచంద్రరరావు, ఆళ్ళ సాంబయ్య పాల్గొన్నారు.


పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్లుగా ప్రమాణం చేస్తున్న అప్పారావు, బొల్లయ్య, మరియదాసు

మానవ అక్రమ రవాణాపై న్యాయ విజ్ఞాన సదస్సు

పిడుగురాళ్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ టి ప్రవల్లిక ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంపై న్యాయ అవగాహన సదస్సు స్థానిక లెనిన్‌నగర్ పాఠశాలలో జరిగింది. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ ట్రాఫికింగ్ ముఠాల చేతుల్లో చిక్కకుండా ప్రతిఒక్కరు జాగ్రత్తపడాలని, యువత వ్యసనాలకు దూరంగా వున్నప్పుడే భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కుమారస్వామి, హెచ్‌ఎం నాగేశ్వరరావు, బార్ అసోసియేషన్ కార్యదర్శి కోపూరి వెంకటేశ్వర్లు, న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గురజాల న్యాయాధికారి శ్రీనివాసరావు

గురజాలలో....

గురజాల మండల లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్ ఆర్ శరత్‌బాబు ఆదేశాల మేరకు గురజాల సీనియర్ సివిల్ జడ్జి వై శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం గురజాల జీబీసీ కాలనీలో ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో మానవ అక్రమరవాణా వ్యతిరేక దినోత్సవంపై అవగాహన కార్యక్రమం జరిగింది. బాలబాలికలకు మోసపూరిత ప్రకటనలు, మాటలకు జాగ్రత్త ఎలా ఉండాలో న్యాయాధికారి వై శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట శ్రీనివాసరావు వివరించారు. న్యాయవాదులు కె చలమరాజు, కె ప్రభుదాసు తదితరులున్నారు.

కూటమి ప్రభుత్వ పాలన బాగుందయ్యా..

● ఎమ్మెల్యే కన్నాతో మహిళలు

రాజుపాలెం, జూలై 30(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలన బాగుందని మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని నెమలిపురి గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథి హజరైన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అధికారులు సరోజ, సత్యానారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు అంచుల నరసింహరావు, జనసేన పార్టీ అధ్యక్షుడు తోట నరసయ్య, జిల్లా అధికార ప్రతినిధి పూజల వెంకటకోటయ్య, గుత్తా వెంకట్రావు, నాయకులు వడ్డెంపూడి పవన్‌కుమార్, గంగవరపు రామలక్ష్మణరావు, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు రెడ్డిగూడెం వాసు, మొరసా శ్రీను, నాయకులు పల్లపాటి పెద్దిరాజు, సానికొమ్ము కొటిరెడ్డి, అంకాళ్ల ప్రభుదాసు, శనగపూల నరసింహరావు, నల్లగొర్ల సాంబశివరావు, కుందూరు పేతురు, తోట శ్రీను, పులిబండ్ల సాంబశివరావు, లేబాకుల బ్రహ్మయ్య, శనగపూల వెంకయ్య తదితరులు ఉన్నారు.


రాజుపాలెం: కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నా



ఉత్తర అమెరికా తెలుగు సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీహరికి సత్కరిస్తున్న ఎమ్మెల్యే కన్నా

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

సత్తెనపల్లి రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. శ్రీహరి ఆధ్వర్యంలో కాటూరి ఆస్పత్రి సహకారంతో మండలంలోని కట్టమూరులో బుధవారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఐలు గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తే పేదలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహన్‌కృష్ణ, నాట్స్ చైర్మన్ ప్రశాంత్, టీడీపీ నాయకులు మండడి బాబు, కోట మల్లిఖార్జునరావు, మండడి వెంకటశివనాగరాజు, మండడి కృష్ణారావు, మండడి రాంబాబు, మండడపు వెంకటేశ్వరరావు, బేతపూడి శివప్రసాదు, మండడపు నారాయణ, మార్కెట్ యార్డు చైర్మన్ కోమటినేని శోభారాణి, మండడి కాళీ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

కాపు కో-ఆర్డినేటర్‌గా యర్రంశెట్టి

నకరికల్లు, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా కాపు సామాజికవర్గ కో-ఆర్డినేటర్‌గా నకరికల్లుకు చెందిన యర్రంశెట్టి మల్లికార్జునరావును నియమించారు. బుధవారం తన నియామకానికి కృషి చేసిన పెద్దిరెడ్డి శివ భాస్కర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సీపీఐ ఏరియా కార్యదర్శిగా శ్రీనివాసరెడ్డి

కారంపూడి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సీపీఐ మాచర్ల ఏరియా కార్యదర్శిగా మేకపోతుల శ్రీనివాసరెడ్డి మరోమారు ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన సీపీఐ మహాసభల్లో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డికి సీపీఐ మండల కార్యదర్శి షేక్ సైదా, సహాయ కార్యదర్శి మేకపోతు చినకోటిరెడ్డి, నాగమణి అభినందనలు తెలిపారు.

సబ్సిడీపై రైతులకు విత్తనాల పంపిణీ

క్రోసూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగవరంలో వందశాతం సబ్సిడీపై బుధవారం రైతులకు విత్తనాలను అందజేశారు. గ్రామంలో జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో క్రోసూరు ఏడీఏ మస్తానమ్మ, ఏవో పీ వేణుగోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ కౌలు రైతులందరూ గుర్తింపు కార్డులు పొందాలన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్‌కు సంబంధించి రైతుసేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించాలన్నారు. పంటల బీమాకు ఆగస్టు 15 వరకు గడువు ఉందన్నారు. కార్యక్రమంలో రామాంజనేయులు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ రామకృష్ణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పొడి, తడి చెత్తను వేరు చేయాలి

● డీపీవో నాగేశ్వరనాయక్

దుర్గి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పొడి, తడి చెత్తను వేరుచేయాలని జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వరనాయక్ సూచించారు. బుధవారం దుర్గిలో ఆయన పర్యటించారు. పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్న వీధులకెళ్లి పరిశీలించి కార్మికులకు పలు సూచనలు చేశారు. అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. స్వచ్ఛ సంకల్పం, రిక్షాలు మరమ్మతులకు గురయ్యాయని కార్మికులు డీపీవో దృష్టికి తీసుకెళ్లగా కొత్తవి కొనుగోలు చేసేందుకు ప్రయత్నం చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యప్రసాద్, కార్యదర్శి కృష్ణ, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.


పారిశుధ్య కార్మికులకు సూచనలు చేస్తున్న అంజయ్య

నష్ట పరిహారం పెంచాలని రైతుల ఆందోళన

● రహదారికి అడ్డంగా మంచాలు

రెంటచింతల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): 167 ఏడీ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం పంపిణీలో జాప్యం జరగడంతోపాటు ప్రభుత్వం చెల్లించే అత్తెసరు డబ్బులు తమకొద్దంటూ పలువురు రైతులు బుధవారం జంక్షన్ సమీపంలోని బైపాస్ రోడ్డు నిర్మాణం వద్ద నిరసనకు దిగారు. పనులు జరుగుతున్న వాహనాలన్నింటిని నిలిపివేశారు. నర్సరీ నిర్వాహకులకు రూ.1.37 కోట్ల దాకా చెల్లించి నిజంగా భూములు కోల్పోయిన రైతులకు రిక్తహస్తం చూపిస్తున్నారని మండి పడ్డారు. మార్కెట్ విలువ ప్రకారం ఎకరాకు రూ.2.10 చెల్లించాల్సిందేనని భీష్మించారు. కార్యక్రమంలో పాశం లచ్చిరెడ్డితో పాటు రైతులు పాల్గొన్నారు.


జాతీయ రహదారికి అడ్డంగా మంచాలు వేసి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

సుపరిపాలన తొలిఅడుగులో గురజాల టాప్ 3


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే యరపతినేని (ఫైల్)

పిడుగురాళ్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రభుత్వ పథకాలను ఇంటింటికి వివరించే కార్యక్రమంలో భాగంగా జూలై 2న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర వ్యాప్తంగా మొదలుపెట్టిన సుపరిపాలన తొలిఅడు గు కార్యక్రమం నిర్వహణలో రాష్ట్రంలో గురజాల నియోజకవర్గం బుధవారం నాటికి టాప్ 3లో వుంది. గురజాల నియోజకవర్గ వ్యాప్తంగా ఎమ్మెల్యే యరపతినేనితోపాటు ఆయా గ్రామ, మండల పార్టీ శ్రేణులు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ పథకాలను తీసుకెళ్లడంలో ముందున్నట్లు టీడీపీ సర్వేలో గుర్తించారు. ఎమ్మెల్యే యరపతినేని ఇప్పటికే నియోజకవర్గంలోని ప్రధాన గ్రామాలు, పట్టణాల పరిధిలోని వార్డుల్లో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొంటూ ఆయా ప్రాంతా ల ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా చేయడంతోపాటు, వృద్ధులు అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ శ్రేణుల కుటుంబాలే కాకుండా పార్టీలకు అతీతంగా అందిస్తున్న ఆర్థిక సహాయంలోనూ నియోజకవర్గం ముందంజలో వున్నట్లు గుర్తింపు వచ్చినట్లు పార్టీ శ్రేణులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేపాటు ఆయన తనయుడు నిఖిల్, మండల పార్టీ నేతలు ఇంటింటికి ప్రభుత్వ పథకాలను వివరించడం దాదాపు పూర్తిచేశారు. నియోజకవర్గం వ్యాప్తంగా లక్షా 14వేల 268 గృహాలు వుండగా బుధవారం నాటికి లక్షా 3వేల 652 గృహాలను పూర్తిచేయడంతో గురజాల నియోజకవర్గం రాష్ట్రంలో గురజాలకు టాప్ 3 ర్యాంక్‌ను కేటాయించడం పార్టీ శ్రేణుల కృషి ఫలితమేనని నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంక్షిప్తం...

● దాచేపల్లి: పాత ఉత్పత్తిదారులకు బుధవారం రూ.3,06,532 బోనస్‌గా పంపిణీ చేశారు. శాంతినగర్, వీరాపురం గ్రామాలకు చెందిన పాల ఉత్పత్తిదారులకు ఈ బోనస్ అందజేశారు. కార్యక్రమంలో సంగం డెయిరీ గురజాల మేనేజర్ డాక్టర్ ఎస్ శివరామకృష్ణ, సూపర్‌వైజర్ షేక్ అబ్దుల్‌రషీదు, వీరాపురం పాలకేంద్రం ప్రెసిడెంట్ వేజెళ్ళ జోగేశ్వరరావు పాల్గొన్నారు.

● నాగార్జునసాగర్ డ్యామ్ నుంచి వరదనీరు విడుదల చేస్తుండటంతో నది ఒడ్డున నివశిస్తున్న పల్లెకార్లను రెవెన్యూ, పంచాయతీ అధికారులు అప్రమత్తం చేశారు. బుధవారం దాచేపల్లి మండలం రామాపురంలో పల్లెకార్లను అధికారులు కలిశారు. నీటి ఉధృతి తగ్గేవరకు చేపల వేట కొనసాగించరాదని తెలిపారు.

● పిడుగురాళ్ళ: పట్టణ సమీపంలోని మారుతీనగర్‌లో బుధవారం పౌరహక్కుల దినోత్సవం జరిగింది. కార్యక్రమంలో తహసీల్దార్ జె మధుబాబు, ఆర్‌ఐ శ్రీనుబాబు, వీఆర్‌ఓ శాస్త్రి తదితరులున్నారు.

● మాచవరం: పత్తి పంటలో రసం పీల్చు పురుగు నివారణకు వేపనూనె పిచికారి చేసుకోవాలని ఏవో రామమ్మ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని మల్లవోలు కొత్తగణేషునిపాడు గ్రామాల్లో పొలం పిల్చుంది కార్యక్రమం నిర్వహించారు.

● అమరావతి: ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని గుడ్‌షెపర్డ్ కాన్వెంట్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులతో ర్యాలీ జరిగింది. ర్యాలీని తహసీల్దార్ డానియేలు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో యాంటో, డియానా, జనచైతన్యసమితి నిర్వాహకులు పాల్గొన్నారు.

● క్రోసూరు: ఊటుకూరు మండల పరిషత్ మెయిన్ ప్రాథమిక పాఠశాలకు షేక్ రహమ్‌తుల్లా, ప్రసన్న రూ.50వేల విలువైన సౌండ్ సిస్టమ్‌ను బహూకరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాఘవ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● క్రోసూరు: క్రోసూరు ఎంఈవోగా జీ కృష్ణ నియమితులయ్యారు. ఆయన గుంటూరులోని ఎస్కేహెచ్ హైస్కూల్‌లో సోషల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పూర్తి అదనపు బాధ్యతలతో ఇక్కడ ఎంఈవోగా నియమితులయ్యారు.

● పెదకూరపాడు: పత్తిపంటలో రసం పీల్చు పురుగుల నివారణకు వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటించాలని ఏవో జీ కృష్ణయ్య అన్నారు. మండలంలోని తమ్మవరం, కాశిపాడు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడారు.

● సత్తెనపలి: ఆర్యవైశ్యులు రాజకీయంగా కూడా బలోపేతం కావాలంటే ఎస్సీ ఎస్టీ వర్గాలను కలుపుకొని అధికారం దిశగా పయనించాలని లోక్‌జనశక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చందోలు సత్యనారాయణ అన్నారు. బుధవారం పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి కళ్యాణ మండపంలో ఆర్యవైశ్య నేతలతో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ విజయకుమార్, వెంకటరావు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

● నకరికల్లు: ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ బీ శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. బుధవారం దేచవరం రైతుసేవా కేంద్రంలో రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో దేవదాసు, ఏఏలు పవన్‌కుమార్, రవిబాబులు పాల్గొన్నారు.

● ఎరువులు, పురుగుమందుల డీలర్లు ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు ఎరువుల అమ్మకాలు జరిపితే చర్యలు తీసుకుంటామని పిడుగురాళ్ళ ఏడీఏ బీ శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎరువుల, పురుగుమందుల విత్తనాల డీలర్లతో సమావేశం నిర్వహించారు.కార్యక్రమంలో ఏవో కే దేవదాసు, డీలర్లు పాల్గొన్నారు.

● పౌరహక్కులు ప్రతి ఒక్కరి బాధ్యతని నకరికల్లు ఏఎస్‌ఐ కేఎస్‌ఎన్ ప్రసాదు అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. పౌరుల హక్కులకు భంగం వాటిల్లకుండా అందరూ సమన్వయంతో పనిచేయాలని డీటీ తుమ్మా కొండారెడ్డి అన్నారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో ప్రసాదు, ఆర్‌ఐ తోట సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

● సత్తెనపల్లి: టీడీపీ పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు చిన అబ్దుల్లా ఆధ్వర్యంలో బుధవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సుభానీ, దొడ్లేరు సైదా, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● రాజుపాలెం: గ్రామాలలోని ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంపీడీవో సత్యానారాయణ కోరారు. బుధవారం రాజుపాలెంలో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్యశాఖ సహాయసంచాలకులు వీరయ్య, ఏవో వెంకటనరసయ్య, జడ్పీటీసీ సునీత, తహసీల్దార్ సరోజ ఉన్నారు.

● రాజుపాలెం మండలంలో కూటమిలో భాగమైన జనసేన పార్టీకి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మంచి గుర్తింపు ఇస్తున్నారని మంత్రి నాదెండ్ల మనోహర్‌కు అనుపాలెం పీఏసీఎస్ అధ్యక్షుడు తోట నరసయ్య చెప్పారు. బుధవారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.

● మాచర్లటౌన్: రచ్చమలపాడులో గల సంగం డెయిరీ పాలకేంద్రంలో బుధవారం పాలఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీచేశారు. మొత్తం రూ. 4,12,546 బోనస్‌ను అందించారు. కార్యక్రమంలో సంగం డెయిరీ డైరెక్టర్ పి.శ్రీనివాసరావు, మేనేజర్ శివరామకృష్ణ, రవితేజ, సూపర్‌వైజర్ శివ పాల్గొన్నారు.

● మాచర్ల రూరల్: ఎరువులు, పురుగుమందుల అమ్మకాల విషయంలో డీలర్లు అవకతవకలకు పాల్పడి రైతులకు నష్టం కలిగిస్తే ఉద్యమిస్తామని సీపీఐ ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

● గురజాలటౌన్: మండలంలోని తేలుకుట్లకు చెందిన నాగెండ్ల వెంకయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించారు. బుధవారం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు వెంకయ్య నివాసానికి చేరుకొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పులుకూరి కాంతారావు, కూరపాటి హనుమంతురావు, నాగెండ్ల తిరుపతిరావు, బత్తుల కొండలు, కూటమి నేతలు పాల్గొన్నారు.

● మాచర్లటౌన్: రైతుల పంటలకు బీమా చేయించుకోవాలని ఏవో పాపకుమారి సూచించారు. పట్టణంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఎం మార్కొండేయులు పాల్గొన్నారు.

● దురి : పోతురాజుగడ్డలో ఉన్న గణనాథునికి భక్తులు బుధవారం జలాభిషేకం నిర్వహించారు. శ్రావణమాసం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం ఊరేగింపు జరిపారు.



మాట్లాడుతున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, చైర్మన్ కొనకళ్ళ నారాయణ తదితరులు

మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం
అందరి బాధ్యత

- తొలినాళ్ళలో జాతరను తలపించే అవకాశం
- బస్టాండ్‌లలో అదనపు సౌకర్యాలు కల్పించాలి
- బస్సులను కండీషన్‌లో ఉంచే బాధ్యత అధికారులదే
- సమీక్షలో ఆర్టీసీ ఎండీ తిరుమలరావు, చైర్మన్ కొనకళ్ళ

గుంటూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి తలపెట్టిన మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణ పథకం అమలు బాధ్యత గ్యారేజ్ సిబ్బంది స్థాయి నుంచి అధికారుల వరకు అందరిపై ఉందని ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరులమరావు, చైర్మన్ కొనకళ్ళ నారాయణ సూచించారు. జోన్-3 పరిధిలోని నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని డిపో మేనేజర్లతో గుంటూరులోని ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో బుధవారం వారు సమీక్ష నిర్వహించారు. పథకం అమలు చేయనున్న తొలినాళ్ళలో మహిళలతో పెద్ద ఎత్తున జాతర తలపించే పరిస్థితులున్నాయని, అందుకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. ప్రస్తుతమున్న బస్సుల కండీషన్‌ను మరింత తీర్చిదిద్దాలని ఆదేశించారు. బస్సుల ఫుట్ బోర్డులు కానీ, లోపల సీట్లు వంటివి నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. అలానే బస్టాండ్‌లలో మహిళల కోసం కుర్చీలు, టాయిలెట్లు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మహిళల రద్దీకి అనుగుణంగా సర్వీసులను అందుబాటులో ఉంచాలన్నారు. ముఖ్యంగా గ్యారేజ్‌లోని మెకానిక్‌లు, డ్రైవర్‌లు, కండక్టర్‌లు పూర్తిస్థాయిలో కృషిచేస్తే పథకం అమలు సాధ్యమవుతుందన్నారు. త్వరలో 1050 కొత్త ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రానున్నాయన్నారు. అలానే ప్రతి ఏటా డీజిల్ బస్సుల స్థానంలో 1500 నుంచి 2వేల వరకు ఎలక్ట్రిక్ బస్సులు వస్తాయని ఇప్పటికే సీఎం చంద్రబాబు చెప్పారన్నారు. ప్రస్తుతం ఉన్న బస్సులతోనే పథకాన్ని అమలు చేయాలని సూచించారు. సమీక్షలో ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సురేష్‌రెడ్డి, జోన్ ఈడీ నాగేంద్రప్రసాద్, డీపీటీవో సామ్రాజ్యం, జోన్ డిప్యూటీ సీటీఎం రవికాంత్, పలువురు డిపో మేనేజర్‌లు ఉన్నారు.

ఏఐని విస్తృతంగా వినియోగించాలి

- డీఆర్‌ఎం సుధేష్ణ సేన్

గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధ(ఏఐ)ని రైల్వేలోని వివిధ విభాగాల్లో వినియోగించడంపై ప్రతీ ఒక్క అధికారి దృష్టి పెట్టాలని గుంటూరు రైల్వే డీఆర్‌ఎం సుధేష్ణ సేన్ ఆదేశించారు. బుధవారం పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవన్‌లో రోజువారి పనుల్లో ఏఐ వినియోగంపై అధికారులకు శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ పనిలో వేగం పెరగడానికి, సులభతరం చేయడానికి ఏఐ పరికరాల వినియోగించాలని సూచించారు. భవిష్యత్తులో ఏఐ ఎన్నో పనులను చేయబోతున్నదని, అందుకు తగినట్లుగా అందరూ సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం ఎం రమేష్‌కుమార్, సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, డీసీఎం కమలాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ 2003 టీచర్స్‌కు పాత పెన్షన్ అమలుచేయాలి

- సీఎస్ విజయానంద్‌కు సంఘం నాయకుల వినతి

గుంటూరు (విద్య), జూలై 30(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని కోరుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు డీఎస్సీ 2003 టీచర్స్ ఫోరమ్ నాయ కులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వాల జాప్యం వల్ల డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆందోళన వ్య క్తం చేశారు. ఇతర శాఖల ఉద్యోగులకు వెంటనే పాత పెన్షన్ పథకాన్ని చేయాలని కోరారు. తమ సమస్యలు ఎన్నిసార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎస్ విజయానంద్‌కు వినతి పత్రం ఇచ్చిన వారిలో మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, టీచర్స్ ఫోరమ్ ఏపీ నాయకులు మోపిదేవి శివశంకరరావు తదితరులు ఉన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంస్థ
బలోపేతానికి కృషి



ద్రవ జీవామృతంను పరిశీలిస్తున్న డాక్టర్ షేక్ ఎన్ మీరా, ఎం యుగంధర్, పాల్గొన్న రైతులు

గుంటూరు(తూర్పు), జూలై 30(ఆంధ్రజ్యోతి): రైతు ఉత్పత్తిదారుల సంస్థల (ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్) బలోపేతానికి కృషి చేస్తున్నట్టు ఐకార్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ మీరా అన్నారు. కృషి విజ్ఞాన కేంద్ర దత్తత గ్రామమైన రూరల్ మండలం జొన్నలగడ్డ గ్రామంలో క్షేత్ర పరిశీలనలో భాగంగా వరి పొలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సేంద్రియ వ్యవసాయంలో భాగంగా ద్రవజీవామృతంను ప రిశీలించారు. ఆయన మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులను ఒకే గొడుగు కిందకు తీసుకురావడమే ఈ సంస్థ లక్ష్యమని అన్నారు. ఈ సంస్థలో చేరేవారి పంటలకు మార్కెటింగ్, సాంకేతిక సదుపాయాలను కల్పిస్తున్నట్టు చెప్పారు. ఆర్థిక బలంతో పాటు మార్కెటు అనుసంధానం పెంపొందించుకునేందుకు ఈ సంస్థ దోహదపడుతుందన్నారు. అనంతరం మినుములో నూతన వంగడాలను 375 మంది రైతులకు అందించి విత్తన ఉత్పత్తిదారులుగా తయారవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేవీకే హెడ్ ఎం యుగంధర్, సీనియర్ శాస్త్రవేత్త ఎం గంగాదేవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

లాభాల బాటలో డ్రాగన్ ఫ్రూట్స్



డ్రాగన్ ఫ్రూట్స్ పంట



రైతు మట్టయ్య



- తక్కువ పెట్టుబడితో అధికలాభం
- డ్రాగన్ ఫ్రూట్స్ పంటకు మొగ్గు చూపుతున్నరైతులు

గురజాలటౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): డ్రాగన్ ఫ్రూట్స్ పంట తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తున్నాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎక్కడా మండలంలో డ్రాగన్ ఫ్రూట్ పంటలు లేవు. లాభాలు ఎక్కువగా రావడంతో డ్రాగన్ ఫ్రూట్ పంటకు రైతులు మొగ్గు చూపుతున్నారు. మండలంలోని పులిపాడులో కొమ్మినేని మట్టయ్య అనే రైతు నాలుగు ఎకరాల్లో గత నాలుగేళ్లుగా డ్రాగన్ ఫ్రూట్ పంట సాగు చేస్తున్నారు. డ్రాగన్ ఫ్రూట్ పంట వలన వచ్చే లాభాలు, నష్టాలపై మట్టయ్య మాట్లాడుతూ డ్రాగన్ ఫ్రూట్ మొక్క ఎండ 45 డిగ్రీలలో కూడా బతుకుతుందన్నారు. వర్షం ఎక్కువైనా తక్కువైనా మొక్క బతుకుతుందన్నారు. అలాగే డ్రాగన్ ఫ్రూట్ మొక్క నాటినప్పటి నుంచి వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకొని పంటను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఎకరాకు సుమారు రూ.10 లక్షల దాకా ఖర్చు అవుతుందని, మొక్కలు నాటిన తరువాత రెండేళ్లకు కాయ వస్తుందన్నారు. ఎకరాకు సుమారు 15 టన్నుల నుంచి 20 టన్నుల వరకు దిగుబడి వస్తుందన్నారు. 20 యేళ్ల పాటు పంట చేతికి వస్తుందన్నారు. రెండేళ్లలో పెట్టుబడి మొత్తం పోయి లాభాలు తెస్తుందన్నారు. దీంతో మండలంలో పలువురు రైతులు డ్రాగన్‌ఫ్రూట్స్ పంటలు వేసేందుకు మొగ్గు చూపుతున్నారు.

పల్లెలు పచ్చగా ఉంటేనే కాదు... పల్లెలు ఎంత పరిశుభ్రంగా ఉంటే, ప్రజలు అంత ఆరోగ్యంగా ఉంటారంటూ క్లీన్ విలేజ్ కార్యక్రమానికి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వినూత్న రీతిలో శ్రీకారం చుట్టారు. రోజంతా ఒకే గ్రామంలో ఉండి, ప్రతి వీధిలో పర్యటించి, ఎక్కడా పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చూడాలనే కొత్త ఆలోచనతో ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీనితోపాటే గ్రామంలోని ప్రజలకున్న సమస్యలను తెలుసుకుంటూ, వాటికీ పరిష్కారం చూపారు. మెగా శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా బుధవారం గుంటూరు జిల్లా తెనాలి మండల పరిధిలోని కొలకలూరు మేజర్ పంచాయతీలో క్లీన్ కొలకలూరు కార్యక్రమాన్ని చేపట్టారు.

ప్రతి గ్రామం పరిశుభ్రంగా..

- క్లీన్ విలేజ్.. క్లీన్ కొలకలూరుకు మంత్రి మనోహర్ శ్రీకారం
- వినూత్న రీతిలో రోజంతా ఒక గ్రామంలోనే
- అప్పటికప్పుడు పరిష్కారం దిశగా తొలి అడుగు



సీసీ రోడ్డుకు కాలువ లేకపోవడంతో ఎక్స్‌కవేటర్ సాయంతో మురుగు తీయిస్తున్న మంత్రిమనోహర్

తెనాలిరూరల్, జూలై30(ఆంధ్రజ్యోతి): మురుగు కూపంగా ఉన్న కొలకలూరు గ్రామాన్ని పచ్చదనం పరిశుభ్రతలకు నిలయంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. బుధవారం మండలంలోని కొలకలూరులో మెగా శానిటేషన్ డ్రైవ్‌ను చేపట్టారు. తెనాలి మునిసిపాలిటీ, మండలంలోని పలు పంచాయతీల పారిశుధ్య సిబ్బందితో గ్రామంలోని వీధుల్లో కాలువలు పూడికతీత, బ్లీచింగ్ చిమ్మించడం వంటివి జరిపారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం సాయంత్రం 5 గంటలవరకూ సాగింది. మంత్రి మనోహర్ జరుగుతున్న పారిశుధ్య పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రధానంగా గ్రామంలో బీసీ కాలనీ శానిటేషన్‌లోపంతో కునారిల్లుతుండటాన్ని మంత్రిమనోహర్ గుర్తించారు. అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో శానిటేషన్ అధ్వానంగా ఉంటే మీరేం చేస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేశారు. మండలంలోనే అత్యధికంగా 16వేల మంది జనభా ఉన్న గ్రామంమే ఇంత అధ్వానంగా ఉండటం ఏంటని మండిపడ్డారు. వర్షాలు కురుస్తున్నాయి కాలువల్లో పారుదల కావాల్సిన నీరు రోడ్లపైకి చేరుతున్నాయి. చిన్నారులు, పెద్దలు ఈ నీటిలో నడిచి వెళ్లితే అనారోగ్యసమస్యలు రావా అంటూ అధికారులను నిలదీశారు. తాను వచ్చి చూస్తేనే ఇంత దారుణంగా ఉంటే రోజు ఇక్కడే ఉండే స్థానికుల పరిస్థితి ఏంత బాధాకరంగా ఉంటుందో ఊహించగలనన్నారు. ఇకనైనా నిర్లక్ష్యాన్ని విడనాడాలని సూచించారు. రోడ్డు పొడవునా స్థానికులతో మాట్లాడి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. తమ కాలనీలో దాదాపుగా ఆరేళ్లుగా పారిశుధ్యం అధ్వానంగా తయారై దుర్భరమైన జీవితం గడుపుతున్నామని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. గ్రామానికి విచ్చేసిన మంత్రి మనోహర్‌కు ఆ గ్రామ కూటమి నాయకులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. పూలమాలలు వేసి దుశాలవాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందించారు. సబ్‌కలెక్టర్ సంజనసింహ, డీపీవో నాగసాయిపవన్‌కుమార్, సర్పంచ్ డాక్టర్ చొప్పర ప్రీతి, ఎంపీడీవో అత్తోట దీప్తి, తహసీల్దార్ గోపాలకృష్ణ, డ్వామా, ఇరిగేషన్, ఎలక్ట్రిసిటీ, ఆర్‌డబ్ల్యుఎస్ పలు శాఖల అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పని చేస్తున్న ఉపాధి కూలీలు

ఉపాధిలో.. అవినీతికి చెక్

- నిబంధనలు కఠినతరం
- పని ప్రదేశంలో రెండు విడతలుగా హాజరు నమోదు
- శ్రామికుల యాప్‌లో అప్‌లోడ్
- ఆదేశాలు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం

సత్తెనపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపాధి హామీ పథకం అమల్లోని అవినీతికి అడ్డుకట్ట వేసే దిశగా అడుగులు పడుతున్నాయి. దీని కోసం కేంద్ర ప్రభుత్వం నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ యాప్ తీసుకు వచ్చింది. ఈ విధానం ద్వారా ఉపాధి కూలీలు ఉదయం, సాయంత్రం పని ప్రదేశంలో ముఖ హాజరు వేసేలా తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. దొంగ మస్టర్ల కట్టడికి కేంద్రం మరికొన్ని చర్యలు చేపట్టింది. ఇప్పటి వరకు ఉన్న నిబంధనలను మరింత కఠినతరం చేయటంతో పాటు సంబంధిత అధికారుల పర్యవేక్షణ బాధ్యతలను పెంచింది. ఉపాధి పథకంలో ఇప్పటి వరకు పనులు చేస్తున్న కూలీలు ఒక్క పూట మాత్రమే పని చేసేవారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు వారిని ఫోటోలు తీసి నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా రెండు పూటలా పని చేసినట్లు హాజరు వేసి ఆ ఫోటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేవారు. అలా పని చేసిన కూలీలకు ఒక పూట మస్టర్ల ఆధారంగానే వేతనాలు చెల్లించే వారు. ఈ క్రమంలో కొందరు ఫీల్డ్ అసిస్టెంట్‌లు అవినీతికి పాల్పడే అవకాశాలు ఎక్కువగా ఉండేవి. సామాజిక తనిఖీలు, ఆడిట్‌లు జరుగుతున్నప్పుడు అవినీతి జరిగినట్టు రుజువైతే సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్‌లకు జరిమానాలు విధించే వారు. దీనిని అరికట్టేందుకు ఉదయం పనికి రాగానే ఒక సారి, సాయంత్రం 4 గంటల తరువాత మరో సారి ఫోటోలు తీసి వాటిని నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. శ్రామికుల వేతనాలు చెల్లించేందుకు ఈ ఫోటోలు తప్పనిసరి. లేదంటే ఆ రోజు వేతనం రానట్టే.

అమలు తీరు ఇలా...

గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్‌లు తీసే ఫోటోలను పంచాయతీ కార్యదర్శులకు అప్‌లోడ్ చేయాలి. వాటిని నిరంతరం కార్యదర్శులు పర్యవేక్షిస్తూ నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్‌లో ఏపీవోలకు నివేదిక అందజేయాల్సి ఉంది. ఫోటోలు సక్రమంగా తీశారనేది మండల స్థాయి అధికారులు పరిశీలించాలి. మండల పరిధిలో వచ్చిన అన్ని ఫోటోలకు సంబంధించి 20 శాతం వివరాలను జిల్లా అధికారులకు అందజేయాలి. క్షేత్ర స్థాయిలో రెండో సారి ఫోటోలు తీయని ఫీల్డ్ అసిస్టెంట్, సీనియర్ మేట్ల పై క్రమశిక్షణా చర్యలు తీసుకోనున్నారు. నూతన మస్టర్ల విధానం అమలుతో కూలీలు తప్పనిసరిగా పని ప్రదేశంలో ఉండాల్సి వస్తుంది.

కౌలు చెల్లింపులపై రైతుల ఆగ్రహం

- మ్యుటేషన్ వంకతో చెల్లింపుల నిలుపుదల
- తాజా జాబితాలో మృతుల పేర్లు ప్రత్యక్షం
- ఇంకా 6,114 మందికి 60 కోట్లు బకాయి
- గ్రీవెన్స్ దినోత్సవం రోజు ఆందోళనకు సిద్ధం

గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాజధాని రైతుల కౌలు చెల్లింపుల తీరుపై రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. 6 వేలమందికి పైగా కౌలు చెల్లించకుండా ఆపడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. పైపెచ్చు తాజాగా రూపొందించిన జాబితాలో మృతుల పేర్లు కూడా కనిపించడంతో రైతులు అవాక్కవుతున్నారు. జాబితా రూపకల్పనలో సీఆర్డీఏ అధికారుల తీరుపై మండిపడుతున్నారు. రాజధాని కోసం భూ సమీకరణ చేపట్టిన సమయంలో రైతులకు పదేళ్లపాటు కౌలు చెల్లించేందుకు గత టీడీపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. అయితే వైసీపీ ప్రభుత్వం మూడేళ్లపాటు కౌలు చెల్లించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక బకాయిలు చెల్లించింది. తాజాగా మరో ఐదేళ్ల పాటు కౌలు చెల్లింపును కూటమి ప్రభుత్వం పొడిగించింది. అయితే కౌలు చెల్లింపు ఇప్పటికే రెండు నెలలు ఆలస్యం అయింది. ఎట్టకేలకు జూలైలో కౌలు వేసినప్పటికీ అందులో 6,114 మందికి రూ.60 కోట్ల మేర చెల్లింపులు ఆపేశారు. రిటర్నబుల్ ప్లాట్లలో ఎంతోకొంత అమ్ముకున్నా, బిడ్డల పేర రాసుకున్నా మ్యుటేషన్ పేరుతో వాటిని అధికారులు పరిశీలనలో పెట్టారు. పదేళ్లుగా కౌలు ఇస్తున్న జాబితాలో పేర్లను పరిశీలన పేరుతో ఆపామని సీఆర్డీఏ అధికారులు చెబుతున్నారని రైతులు అంటున్నారు. గతంలో లేని విధంగా ఇప్పుడెలా ఆపుతారంటూ రైతులు నిలదీస్తున్నారు.

● జాబితాలో మృతుల పేర్లు..

తాజాగా పెండింగులో పెట్టిన జాబితాను పరిశీలించే క్రమంలో మృతుల పేర్లు వెలుగు చూశాయని రైతులు చెబుతున్నారు. రైతుల సమక్షంలోనే జరిగిన పరిశీలనలో మృతుల పేర్లు రావడంతో అక్కడే వారు అధికారులను నిలేసినట్లు సమాచారం. కాగా రాజధాని రైతుల్లో చాలామంది ప్లాట్లను వారసుల పేర రాసుకున్నారు. ఇలా మ్యుటేషన్ చేయించుకున్న రైతులకు సంబంధించి వారి పిల్లలకే ప్రభుత్వం కౌలు చెల్లిస్తోంది. అయితే తాజా జాబితాలో పిల్లల పేర రాసుకున్నవారి పేర్లు వచ్చాయి. వారిలో చాలామంది చనిపోయి ఉన్నారు. ఇలా చనిపోయిన వారి పేర్లు జాబితాలో తిరిగి ప్రత్యక్షమవడానికి సీఆర్డీఏ అధికారులే కారణమంటూ రైతులు మండిపడుతున్నారు.

● ఆందోళనకు సిద్ధమవుతున్న బాధితులు

శుక్రవారం జరిగే గ్రీవెన్స్ రోజున కౌలు విషయమై ప్రశ్నించేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ప్రతి శుక్రవారం రాజధానిలో జరిగే గ్రీవెన్స్ స్థానిక అధికారులతో సీఆర్డీఏ తూతూ మంత్రంగా మార్చేసిందని, గ్రీవెన్స్ కార్యక్రమానికి సీఆర్డీఏ అదనపు కమిషనర్ హాజరు కావాలని, అప్పుడే తమ గోడు ప్రభుత్వానికి అర్థమవుతుందని రైతులు అంటున్నారు.

విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు రిజర్వేషన్ కోటా సవరణ

గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నంబరు 17015 భువనేశ్వర్ - సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు రిజర్వేషన్ కోటాని రైల్వే బోర్డు సవరించింది. సెప్టెంబరు 25వ తేదీ నుంచి ఈ సవరణ అమలులోకి రానుంది. ఆ తేదీ నుంచి స్లీపర్‌క్లాస్ బెర్తులు జనరల్ కోటాలో 130, రిమోట్ లొకేషన్ విశాఖపట్టణంలో 70, ఆర్‌ఎల్ రాజమండ్రిలో 15, తత్కాల్ 72, ప్రీమియం తత్కాల్ 72 బెర్తులకు పెరుగుతాయి. ఏసీ టూ టైర్, ఏసీ త్రీటైర్ ఎకానమిలో మాత్రం బెర్తుల సంఖ్యని కోత పెట్టింది.

ఆదాయపన్ను చట్టాలపై అవగాహన ఉండాలి

- ఆదాయపు పన్ను అధికారి ప్రసాద్‌బాబు

గుంటూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఆదాయపు పన్ను చెల్లింపుదారులు నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని ఆదాయపు పన్ను అధికారి బీపీ ప్రసాద్ బాబు తెలిపారు. నగరంపాలెంలోనున్న ఆదాయపు పన్నుశాఖ కార్యాలయంలో బుధవారం బులియన్, గోల్డ్, డైమండ్ వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాన్ కార్డు ధృవీకరణతో పాటు ఫామ్ 60న దాఖలు చేయటంపై అవగాహన కల్పించారు. అలానే ఫామ్ 61/61 ఏ దాఖలు చేయటంపై కూడా తెలియజేస్తూ ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్స్ రిజిష్టర్ చేయటంపై కూడా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఐటీ చట్టాల ప్రకారం వ్యాపారులు అడిగిన సందేహాలను ఆయన నివృత్తి చేశారు. ఇన్‌కంటాక్స్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ నాయకులు రాజేంద్రకుమార్‌జైన్, నరసింహరావు, జగన్నాధరావు తదితరులున్నారు.

మహిళలకు అంతర్గత ఫిర్యాదు కమిటీ ఏర్పాటుచేయాలి

- జిల్లా లీగల్‌సెల్ అధికారి విజయలక్ష్మి

గుంటూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా పదిమందికి పైగా పనిచేస్తారో అక్కడ మహిళలకు అంతర్గత ఫిర్యాదు కమిటీని ఆయా సంస్థలు ఏర్పాటు చేయాలని మహిళా శిశు సంక్షేమశాఖ జిల్లా లీగల్‌సెల్ అధికారి ఎ విజయలక్ష్మి తెలిపారు. జిన్నాటవర్ సెంటర్‌లోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ కమిటీ వారు ఆ పని ప్రదేశంలో కనుక మహిళలు ఎవరైనా లైంగిక వేధింపులకు గురైతే తప్పనిసరిగా రాతపూర్వకంగా ఫిర్యాదు స్వీకరించి విచారించి తప్పు చేసిన వారికి చట్టప్రకారం శిక్ష విధించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కమిటీ రిపోర్టును జిల్లా కలెక్టర్‌కు సమర్పించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఈ చట్టం ప్రకారం అంతర్గత కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీలను ఏర్పాటు చేయకపోతే చట్ట ప్రకారం రూ. 50వేల జరిమానా విధించేలా చట్టంలో ఉందని తెలిపారు. వ్యాపార సంస్థలు తప్పనిసరిగా అంతర్గత కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా చాంబర్ గౌరవ అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు మాట్లాడుతూ దుకాణాల యజమానులు చట్టప్రకారం వ్యవహరించి అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో చాంబర్ అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు, కార్యదర్శులు షరాబు కృష్ణమూర్తి, గొల్లపూడి కాశీ వెంకటరాంబాబు తదితరులున్నారు.

లారీ కిందపడి విద్యార్థి దుర్మరణం

- పొన్నూరు రోడ్డులో హృదయ విదారక ఘటన
- పెన్ కొనుక్కునేందుకు రోడ్డుపైకి రాగా ప్రమాదం

గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మరికొద్ది నిమిషాల్లో తమ్ముడితో కలసి స్కూలుకు బయలుదేరి వెళ్లాల్సిన విద్యార్థి లారీ కిందపడి దుర్మరణం చెందడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. బుధవారం ఉదయం పొన్నూరు రోడ్డులో జరిగిన ఈ దుర్ఘటనలో ఆనందపేట 9వ లైన్‌కి చెందిన షాహిద్ అహ్మద్ (13) మృతి చెందాడు. ఈస్ట్ ట్రాఫిక్ సిఐ అశోక్ కుమార్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పొన్నూరు రోడ్డులోని ఆనందపేటకి చెందిన షేక్ షబ్బీర్ ఆటోనగర్లో కారు మెకానిక్‌గా పనిచేస్తుంటాడు. ఆయనకు భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు. ఇరువురు కొత్తపేటలోని భాష్యం స్కూల్లో చదువుతున్నారు. బుధవారం ఉదయం సుమారు 6 గంటల 45 నిమిషాల సమయంలో వారు స్కూలుకు వెళ్లేందుకు రెడీ అయ్యారు. 9వ తరగతి చదివే పెద్ద కుమారుడు షేక్ షాహిద్ అహ్మద్ పెన్ లేకపోవడంతో కొనుక్కునేందుకు ఇంట్లో ఉన్న స్కూటీతో బయటికి వెళ్లాడు. పొన్నూరు రోడ్డు మీదుగా షాపునకు వెళ్తుండగా ఎస్‌ఆర్ ఫుడ్ కోర్టు ఎదురుగా వచ్చేసరికి వెనుక నుంచి రేషన్ బియ్యం పంపిణీ చేసే లారీ వెళ్తోంది. అదే సమయంలో రోడ్డుపై ఎడమ పక్కన మున్సిపల్ చెత్త బండి నిలబెట్టారు. ఎదురుగా రాంగ్ రూట్లో ఆటో ఎదురొచ్చింది. ఆటో ఎదురుగా రావడంతో ద్విచక్ర వాహనం ఆటోను ఢీకొంటుందనే కంగారులో షాహిద్ అహ్మద్ తన స్కూటీ వెనుక బ్రేకుతోపాటు ముందు బ్రేకు కూడా నొక్కాడు. ఆటో సమీపానికి వెళ్లి ఒక్కసారిగా స్కూటీ ముందు చక్రం అదుపుతప్పి కుడివైపు పడింది. అదే సమయంలో వెనుక నుంచి రేషన్ బియ్యం లోడుతో వెళ్తున్న కంటైనర్ లారీ వెనుక టైర్ కింద షాహిద్ పడిపోయాడు. టైరు షాహిద్ పైకి ఎక్కడంతో అక్కడికక్కడే కన్నుమూశాడు. మరి కొద్ది నిమిషాల్లో అన్నదమ్ములు ఇరువురు స్కూలుకు వెళ్తారనుకున్న తరుణంలో కుమారుడు షాహిద్‌ను మృత్యువు కబళించిందనే వార్త తెలిసిన వెంటనే తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కుప్పకూలిపోయారు. షాహిద్ మరణ వార్త స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ ఘటనపై ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.



షాహిద్ అహ్మద్ (ఫైల్)

ఘోర రోడ్డు ప్రమాదం

- ఇద్దరు మృతి
- నరసరావుపేట మండలం ములకలూరు వద్ద ఘటన

నరసరావుపేట రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ములకలూరు గ్రామం వద్ద బుధవారం రాత్రి రెండు మోటార్ సైకిల్స్ ఢీకొన్నాయి. సత్తెనపల్లి నరసరావుపేట ప్రధాన రహదారిపై నరసరావుపేట మండలం ములకలూరు వద్ద రెండు మోటార్ సైకిల్ ఎదురెదురుగా ఢీకొనగా మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు రోడ్డుపై పడ్డారు. వెనుక నుండి వస్తున్న గుర్తు తెలియని వాహనం వారిపై నుండి వెళ్లడంతో మృతి చెందారు. సత్తెనపల్లి గ్రామానికి చెందిన నాటకం రాకేష్ (34), షేక్ బాజీ (35) అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న నరసరావుపేట రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై కిషోర్ తెలిపారు.

అంగన్‌వాడీల జీతాలు పెంచాలి

గుంటూరు(తూర్పు), జూలై 30(ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా అంగన్‌వాడీలకు జీతాలు పెంచాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయు) గుంటూరు జిల్లా గౌరవ అధ్యక్షురాలు రమణ డిమాండ్ చేశారు. బుధవారం గుంటూరు పశ్చిమ అంగన్వాడీల సమావేశంలో ఆమె ప్రసంగించారు. గత ప్రభుత్వంలో జరిగిన సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను నేటివరకు నెరవేర్చలేదని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు 90శాతం పైగా పనిచేయడం లేదని దీనికి నిరసనగా ఆగస్టు 4న జిల్లాలో ఉన్న అంగన్‌వాడీలందరూ తమ ఫోన్లను సిడిపివోలకు ఇవ్వాలని పిలుపునిచ్చారు. అంగన్వాడీలకు గ్రాట్యుటీ అమలుచేస్తూ జీవో ఇస్తున్నామని ముఖ్యమంత్రి ఆర్భాటంగా ప్రకటించారని, ఆ జీవో ఇంతవరకు అమలుచేయలేదని అన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా జరిగే రాష్ట్రవ్యాప్త ఉద్యమంలో అంగన్వాడీలు, ఇతర చిరుద్యోగులు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమణ, పాల్గొన్న అంగన్‌వాడీలు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

మాయ మాటలకు మోసపోవద్దు: ఎస్‌ఐ పుల్లారావు

నాదెండ్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మాయ మాటలకు మోసపోవద్దని నాదెండ్ల ఎస్‌ఐ పుల్లారావు అన్నారు. గణపవరంలోని సీఆర్ కళాశాలలో మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవీహెచ్‌ఎస్ ప్రసాదు మాట్లాడుతూ సమాజంలో అక్రమ రవాణా ఎక్కువగా జరుగుతున్నదని, వారిలో బాలికలు ఎక్కువగా ఉన్నారన్నారు. ఆశ చూపి బాలికల అక్రమ రవాణా చేస్తున్న వారితో అప్రమత్తంగా ఉండాలని న్యాయవాది మాదాసు భాను ప్రసాదు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మనోహర్, విశ్రాంత ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు, న్యాయవాది శివబాబు తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కుల దినోత్సవం

వినుకొండ టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాయపాలెంలోని ఎస్సీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవాన్ని తహసీల్దార్ సురేష్ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అంటరానితనాన్ని నిర్మూలించడం జరిగిందని, ఎవరైనా కులం పేరుతో దూషించినట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని, సమాజంలోని పౌరులందరికీ హక్కులు కల్పించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, వినుకొండ ఈవోపీఆర్‌డీ సుందరరెడ్డి పాల్గొన్నారు.

రేపు తాగునీటి సరఫరా నిలిపివేత

నరసరావుపేట రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో తాగునీటి సరఫరా చేసే ప్రధాన పైపులైను మరమ్మతులకు గురైన నేపథ్యంలో శుక్రవారం పట్టణంలో తాగునీటి సరఫరా నిలిపివేసి పైపులైన్లకు మరమ్మతులు నిర్వహించనున్నట్లు మునిసిపల్ కమిషనర్ తెలిపారు. శుక్ర వారం ఉదయం, సాయంత్రం తాగునీటి సరఫరా నిలిపివేయడం జరుగుతుందని శనివారం ఉదయం నుంచి సరఫరా యధావిధిగా జరుగుతుందని తెలిపారు. నాగార్జున సాగరు కుడి కాలువ నుంచి తాగునీరు విడుదల చేసిన నేపథ్యంలో శాంతినగర్ ఉన్న తాగునీటి చెరువులను, నకరికల్లు వద్దగల చెరువులను పూర్తిస్థాయిలో నింపి రెండు పూటలా తాగునీటిని సరఫరా చేస్తామన్నారు.



అనాథ శవానికి అంత్యక్రియలు చేస్తున్న సంస్థ సభ్యులు

అనాథ శవానికి అంత్యక్రియలు

వినుకొండటౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అనాథ శవానికి మానవసేవా సమితి స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. పట్టణంలోని ఏనుగుపాలెం రోడ్డులో సాగరిక వైన్స్ సమీపంలో ఓ చెట్టు కింద గుర్తుతెలియని మహిళ మృతదేహం ఉందన్న సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనాథ శవంగా గుర్తించి మానవ సేవా సంస్థ వారు అంత్యక్రియలు చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పి.వి.సురేష్, చామర్తి భవాని శంకర్, లోకేష్, క్రాంతి, ఏసుబాబు, రవి, నాగేంద్రబాబు, మహేష్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

వినుకొండ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సైబర్‌నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఎం.సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో భారతీయ రిజర్వు బ్యాంక్ వారి సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో డిపాజిటర్లు ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్‌పై ఒక రోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌కి అధ్యక్షత వహించిన ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్‌పాల్ మాట్లాడుతూ సిబిల్ స్కోర్‌తో ఆర్థిక క్రమశిక్షణ కలిగి ఎవరైతే ప్రభుత్వ బ్యాంక్ సేవలను సక్రమంగా ఉపయోగించుకుంటారో వారు వ్యాపార రంగంలో అభివృద్ధి చెందుతారన్నారు. కార్యక్రమంలో కెనరా, బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంక్‌ల మేనేజర్లు తేజ, కౌశిక్, మెప్మాసిటీ మిషన్ మేనేజర్ ఉమర్‌వలి, విప్పర్ల విజయభాస్కర్, సంస్థ రిసోర్స్ పర్సన్స్‌లు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

నరసరావుపేట లీగల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఓ గుర్తు తెలియని వ్యక్తి నరసరావుపేటలోని శృంగేరి మఠం పక్క ఉన్నటువంటి కృష్ణవేణి నర్సింగ్ కాలేజీ పక్కన ఖాళీ ప్రదేశంలో చనిపోయి ఉన్నాడు. ఇతని ఆచూకీ అతని పేరు తెలియ రాలేదు. సుమారు 35నుంచి 40 సంవత్సరాల వయసు ఉంటుందని భావిస్తున్నారు. యువకుని వివరాలు తెలిస్తే నరసరావుపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వారికి తెలియజేయాలని నరసరావుపేట మొదటి పట్టణ సీఐ ఒక ప్రకటనలో కోరారు.



గుర్తుతెలియని యువకుడి మృతదేహం

ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడులు తగ్గుతాయి: సైదయ్య

ఈపూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో సాగుచేసే పంటలకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా శిక్షకుడు సైదయ్య అన్నారు. మండల కేంద్రమైన ఈపూరులో దారా ప్రకాశరావు, కాటం నాగరాజు సాగు చేస్తున్న పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. పంటలను చీడపీడల నుంచి రక్షించుకునే విధానం గురించి వివరించారు. ఈ సందర్భంగా సైదయ్య మాట్లాడుతూ నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో భాస్కరరావు, రైతులు పాల్గొన్నారు.

మండల కేంద్రానికి దారేది..?!



అధ్వానంగా ఉన్న ముక్కెళ్ళపాడు - కొత్తజెడ్డావారిపాలెం రోడ్డు, ఐనవోలు - కంభంపాడు రోడ్డు

- 27 పంచాయతీలు, 60కి పైగా గ్రామాల్లోని ప్రజలకు ఇబ్బందులు
- మండల ప్రజలు నూజెండ్లకు రావాలంటే వినుకొండ వచ్చి రావాల్సిన దుస్థితి
- తారు రోడ్లతో అనుసంధానం చేయాలని పలు గ్రామాల ప్రజల వినతి

నూజెండ్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నూజెండ్ల మండలం విస్తీర్ణంలో పెద్దదిగా ఉండటం, 27 పంచాయతీలు, 60కి పైగా గ్రామాల్లోని ప్రజలు మండల కేంద్రం నూజెండ్లకు వచ్చేందుకు సరైన రోడ్డు వసతి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పడమట పల్లెలుగా పిలిచే ఐనవోలు, పెద్దవరం, నాగిరెడ్డిపల్లి, లింగముక్కపల్లి, తంగిరాల, మృత్యుంజాపురం, చింతలచెరువు, ముక్కెళ్ళపాడు, కొత్తజెడ్డావారిపాలెం, భూమాయపాలెం, పాతచెరుకుంపాలెం, కొత్తచెరుకుంపాలెం, రెడ్డికొత్తూరు, చెన్నారెడ్డి కాలనీ, సుధాకర్‌నగర్ తదితర గ్రామాల ప్రజలు అధికారులను కలవాలంటే వినుకొండ వచ్చి నూజెండ్లకు రావాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా చింతలచెరువు, నూజెండ్ల, ఐనవోలు, గుర్రపునాయుడుపాలెం రోడ్లను బీటీ రోడ్లుగా నిర్మిస్తే మండల కేంద్రం వెళ్ళేందుకు సౌలభ్యంగా ఉంటుందని ఎన్నోసార్లు నాయకులు, ప్రజలు విజ్ఞప్తులు చేసినా నేటికి కార్యరూపం దాల్చకపోవటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చి పోయేందుకు ఒకరోజు సమయం వృథా అవుతోందని వాపోతున్నారు. మండల కేంద్రంకు పడమట పల్లెలను అనుసంధానం చేసే విధంగా తారు రోడ్డు నిర్మాణం జరగాలని మండల ప్రజలు కోరుతున్నారు. సంబంధిత అధికారులు ఈ రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ చూపి మండల అభివృద్ధికి సహకరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

సంక్షేమ చట్టం-2007పై అవగాహన కల్పించాలి

● కలెక్టర్ అరుణ్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పీ అరుణ్‌బాబు, పక్కన ఎమ్మెల్యే చదలవాడ, జాయింట్ కలెక్టర్ సూరజ్‌ధనుంజయ్ గనోరే తదితరులు

నరసరావుపేట టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల నిర్వహణ, సంక్షేమ చట్టం-2007పై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పీ అరుణ్‌బాబు అన్నారు. బుధవారం నరసరావుపేట పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా విభిన్న ప్రతిభావంతుల, సీనియర్ సిటిజన్స్ ట్రాన్స్ జెండర్ శాఖ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల నిర్వహణ, సంక్షేమ చట్టం 2007, ట్రాన్స్ జండర్ హక్కుల చట్టం 2019 అమలుపై ఒక్క రోజు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పీ అరుణ్‌బాబు మాట్లాడుతూ తల్లిదండ్రులు, పిల్లల మధ్య సఖ్యత లేని కారణంగా వారి మధ్య వివాదాలు తలెత్తుతున్నాయన్నారు. తల్లిదండ్రులతో సహా ఎవరైనా సీనియర్ సిటిజన్ తన సొంత సంపాదన నుంచి లేదా అతని సొంత ఆస్తి నుంచి తనను తాను కాపాడుకోలేకపోయినప్పుడు ప్రాథమికంగా ఆర్‌డీవో అధ్యక్షతన ఉన్న ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఆర్‌డీవో ద్వారా నోటీసులు అందించి విచారణచేసి సమస్యను సానుకూలంగా పరిష్కరించడం జరుగుతుందన్నారు. సామరస్యంగా పరిష్కారం కాని సమస్యలకు చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వయోవృద్ధులను, తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే సంబంధిత కుమారులు, కుమార్తెలపైన చట్టపరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. న్యాయవాది శిరీష మాట్లాడుతూ తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్లు నిర్వహణ, సంక్షేమం కోసం రాజ్యాంగంలో ఆర్టికల్ 41ద్వారా చట్టాలు చేసుకునే అవకాశం ఉందన్నారు. వృద్ధులు వారి వారసుల నుంచి గౌరవప్రదంగా ఆహారం, దుస్తులు, వసతి, వైద్య చికిత్స పొందడానికి అవసరమైన చట్ట సవరణలు చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి నెల సీనియర్ సిటిజన్ల అవసరాల కోసం వారి వారసులు రూ.10వేలు గరిష్టంగా అందించాలని ఆదేశించిందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్ హక్కుల చట్టం 2019 ద్వారా ట్రాన్స్‌జెండర్‌లకు హక్కులు కల్పించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు అమలు చేస్తుందని, వాటిని అమలు చేయడంలో జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ సిటిజన్స్ ట్రాన్స్‌జెండర్‌ల సంక్షేమ శాఖ ఏడీ దుర్గాబాయ్, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ సాగుతో ఆర్థికవృద్ధి

● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



సభలో మాట్లాడుతున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

ఈపూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పామాయిల్ సాగుచేయడం వలన రైతులు ఆర్థికాభివృద్ధి సాధిస్తారని, అందుకు ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగుకు రాయితీ ఇస్తుందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని ముప్పాళ్ళలో బుధవారం జిల్లా ఉద్యానశాఖ ఆధ్వర్యంలో వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్‌సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీవారి సహకారంతో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చీఫ్‌విప్ జీవీఆంజనేయులు హాజరయ్యారు. ముందుగా ఆయిల్ పామ్ ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో చీఫ్‌విప్ జీవీ మాట్లాడుతూ రైతులు తమకు లాభసాటిగా ఉండే పంటలను సాగు చేసుకోవడం వలన మంచి ఆదాయం పొందవచ్చునన్నారు. జిల్లాలో మొదటి విడతలో ఈపూరు మండలం ఎంపికవడం సంతోషంగా ఉందన్నారు. పామాయిల్ సాగు వలన రైతుకు ఒక ఎకరాకు లక్ష రూపాయలు ఆదాయం వస్తుందన్నారు. నియోజకవర్గంలో పామాయిల్ సాగుకు అనుకూలంగా ఉందని రెండో విడతలో మిగతా మండలాలు ఎంపిక చేశారన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో దాదాపుగా 15రకాల ఉద్యాన పంటలు రాయితీ ద్వారా రైతులకు అందజేస్తుందన్నారు. తోటలలో పంట కుంటలు నిర్మించుకునేందుకు రూ.75వేలు రాయితీ అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే ఏడాది పొడవునా నీటి సౌలభ్యం ఉన్న రైతులు ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా ఆయిల్ పామ్ సాగు చేసుకున్న రైతులకు 90శాతం రాయితీ మీద డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అందజేస్తుందన్నారు. వ్యాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఎం.రామ్మోహన్‌రావు మాట్లాడుతూ రైతులు పండించిన ఆయిల్ పామ్ గెలలను నేరుగా కంపెనీ కొనుగోలు చేస్తుందన్నారు. ఇతర పంటలతో పోల్చితే ఖర్చులు పోను ఎకరాకు లక్ష రూపాయలు మిగులు ఆదాయం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కంపెనీ సీఈవో రామకృష్ణబాబు, జిల్లా ఉద్యాన శాఖాధికారి షేక్ నబీరసూల్, మండల వ్యవసాయాధికారి ఆర్ రామారావు, ఎం.నవీన్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, ఈపూరు సొసైటీ ఛైర్మన్ విడపలపాటి హనుమయ్య, డీసీ ఛైర్మన్ గడిపూడి వేణు, ఏపీడీ ఈపూరి బూసిరెడ్డి, ఏపీవో పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

● వినుకొండ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోకనకొండ, నాగులవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కంది, మిరప, వరి పంటలు సాగు చేసిన రైతులు పంటల బీమా నమోదు చేసుకోవాలని ఏవో జి.వరలక్ష్మి కోరారు. కార్యక్రమంలో ఏఈవో ఆరిఫ్, వీపీఏ చాందిని, రైతులు పాల్గొన్నారు.

● వినుకొండ టౌన్: గుంటి ఆంజనేయ స్వామి పాలకమండలి సభ్యుడిగా పదవి పొందిన ముఖ్యాని రామయ్యను గుమ్మడి కళాపీఠం ఆధ్వర్యంలో కళాకారులు స్థానిక శివయ్యస్థూపం సెంటర్‌లోని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డి.నాగేశ్వరరావు, నరేష్, చిన్న, కృష్ణారెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

● నూజెండ్ల: పంటల సాగులో రైతులు అధికంగా ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గించాలని ఏఈవో ఎల్.ఎలీషా అన్నారు. బుధవారం మండలంలోని ఉప్పలపాడు, తెల్లపాడు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తెల్లబాడు మాజీ సర్పంచ్, సీనియర్ టీడీపీ నాయకులు మల్లేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి రవీంద్ర, గ్రామ వ్యవసాయ సహాయకులు గురునాసర్ పాల్గొన్నారు.

● బొల్లాపల్లి: మండలంలోని నెహ్రూనగర్ తండా పలుకూరు గ్రామాల్లో జిల్లా వనరుల కేంద్ర డీడీఏ శివకుమారి ఆధ్వర్యంలో రైతులకు ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ అధికారి అరుణ జీవన ఎరువుల వాడకంపై రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, ఏఈవోలు మల్లిఖార్జునరావు, వీపీఏలు పాల్గొన్నారు.

● బొల్లాపల్లి: మండలంలోని పేరూరుపాడులో రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి పెమ్మసాని నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పేరూరుపాడు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు దాసరి కోటేశ్వరరావు, కాసరగడ్డ గోవిందరాజులు, బొప్పూడి శ్రీను, గుర్రం నరసింహారావు, గంగినేని రమణయ్య, కాట్ల సుబ్బయ్య, తొర్లకుండ శ్రీనివాసరావు, పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.



సొసైటీ ఛైర్‌పర్సన్‌లు ముంద్రు సుబ్బారావు, బచ్చు అంజిరెడ్డిలను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

సొసైటీ ఛైర్‌పర్సన్లకు అభినందనలు


నూజెండ్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూజెండ్ల, గుర్రపునాయుడుపాలెం సొసైటీ ఛైర్‌పర్సన్‌లుగా బచ్చు అంజిరెడ్డి, ముంద్రు సుబ్బారావులు నూతనంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు లగడపాటి వెంకటరావు, గంగినేని చంద్రశేఖర్, సురేష్, పూర్ణ, బొప్పూడి శ్రీను, రామాంజనేయులు అభినందనలు తెలిపారు.

జీవనోపాధి మెరుగుపర్చడమే నాబార్డు లక్ష్యం: ఎంపీడీవో

శావల్యాపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు వివిధ రంగాల్లో శిక్షణనిచ్చి వారి జీవనోపాధులను మెరుగుపరచడమే లక్ష్యంగా నాబార్డు సంస్థ ఎంతో కృషి చేస్తుందని ఎంపీడీవో సీతారామయ్య అన్నారు. నాబార్డువారి ఆర్థిక సహకారంతో నేచురల్ హెల్త్‌కేర్ సొసైటీవారి ఆధ్వర్యంలో ఎల్‌ఈడీ బల్బుల తయారీలో శిక్షణ పొందిన 30మంది శావల్యాపురం మహిళలకు ఎంపీడీవో సీతారామయ్య బుధవారం శిక్షణకు సంబంధించిన సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

ప్రతి వారాంతంలో పరీక్షలు నిర్వహించాలి

● ఆర్జేడీ పద్మ



సమావేశంలో మాట్లాడుతున్న ఇంటర్మీడియట్ రీజినల్ జేడీ పద్మ

నరసరావుపేట టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు వారాంతంలో పరీక్షలు నిర్వహించాలని ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ జె పద్మ అన్నారు. బుధవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి కార్యాలయంలో జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్‌లతో గుంటూరు జోన్-3 ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నీలావతిదేవి, గుంటూరు ఆర్ఐవో సునీత, జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు: జిల్లా వ్యవసాయ అధికారి

నరసరావుపేట రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎరువులు గోడౌన్స్‌లో ఎరువుల నిల్వలను పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి ఎం జగ్గారావు బుధవారం పరిశీలించారు. పట్టణంలోని పలు ఎరువులు దుకాణాలు తనిఖీ చేసిన అనంతరం ఎరువుల డీలర్లతో ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు ఎరువులు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకొని లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా...

● నరసరావుపేట టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నకరికల్లులో జరిగిన పల్నాడు జిల్లా ఆట్యా-పాట్యా ఎంపికలలో నరసరావుపేట మండలం శంకరభారతిపురం జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ప్రతిభ చాటారని హెచ్‌ఎం పార్వతి బుధవారం తెలిపారు. పోటీలలో పీ వరప్రసాద్, టీ మణిదీప్, జీ లక్ష్మీ ప్రశాంత్, కే వైష్ణవీ ఎంపిక అయ్యారన్నారు.

● నరసరావుపేట టౌన్: నకరికల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి ఆట్యా-పాట్యా జూనియర్ మీట్‌లో వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. బాలికల విభాగంలో బోరుగడ్డ సౌజన్య, షేక్ నజ్మా, బాలుర విభాగంలో కాసా శ్రీనివాసరావులు జిల్లా జట్టుకు ఎంపిక అయ్యారన్నారు.

● నరసరావుపేట టౌన్: ఫార్మసీ రంగం ఇప్పుడే కాదు భవిష్యత్‌లో కూడా ప్రజారోగ్యానికి కేంద్ర బిందువుగా మారుతుందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వీసీ కే గంగాధర్‌రావు అన్నారు. బుధవారం స్థానిక పెట్లూరివారిపాలెంలోని ఏఎంరెడ్డి ఫార్మసీ కళాశాలలో స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిగా ఏఎన్‌యూ వీసీ గంగాధర్‌రావు పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ పీ భార్గవ్‌భూషణ్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో 15,714 మందికి పీఎంజేఏవై కార్డులకు ఈకేవైసీ చేయించాలని వైద్యాధికారి జగన్ నరసింహారెడ్డి బుధవారం తెలిపారు. సంబంధిత ఆయుష్మాన్ మందిరాల్లో ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

● కారుమంచి (శావల్యాపురం): మండలంలోని కారుమంచికి చెందిన పాలరైతు రావెళ్ళ పెద్దశేషయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. సంగం డెయిరీలోని ఎంపీ మిల్క్ ప్రొడ్యూసర్ వెల్ఫేర్ స్కీంద్వారా ఆయన భార్య హనుమాయమ్మకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేలు, రూ.50వేల విలువైన ప్రమాదబీమా చెక్కును సంగం డెయిరీ సూపర్‌వైజర్లు రామాంజనేయులు, రామకృష్ణ బుధవారం అందజేశారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించటమే ధ్యేయం

● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



ఉప్పరపాలెంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

ఈపూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని కొచ్చెర్ల, ఉప్పరపాలెం గ్రామాలలో బుధవారం రాత్రి సుపరిపాలన తొలిఅడుగు ఇంటింటికి ప్రచారం కార్యక్రమంలో జీవీ పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్ళి ఏడాది పాలనలో ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు గురించి వివరించి, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా జీవీ మాట్లాడుతూ పరిశ్రమలకు రాయితీలపై వైసీపీ విమర్శలకు హైకోర్టు తీర్పు చెంపపెట్టు అన్నారు. చేసిన పాపాలకు జగన్ జైలుకు వెళ్ళడానికి సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, కూరాకుల శ్రీనివాసరావు, నర్రా కిశోర్, ఈపూరు సొసైటీ డైరెక్టర్ అయినాల కోటేశ్వరరావు, బుల్లినాయుడు, కూరాకుల హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నిరోధంపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి మధుస్వామి

నరసరావుపేట లీగల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా నిరోధంపై పట్టణంలోని పెద్ద చెరువు 9వ లైన్‌లోని బాలుర సంక్షేమ వసతి గృహంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ప్రధాన సీనియర్ సివిల్ అధికారి కే మధుస్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు వ్యక్తులు చిన్నపిల్లలను చట్టవ్యతిరేక కార్యకలాపాలకు వినియోగిస్తుంటారన్నారు. అటువంటి కార్యకలాపాలు చట్ట వ్యతిరేకమన్నారు. అపరిచితులను నమ్మవద్దన్నారు. విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే హాస్టల్ వార్డెన్ దృష్టికితీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు, పారాలీగల్ వలంటీర్లు, హాస్టల్ వార్డెన్లు, విద్యార్థులు, రెండో పట్టణ పోలీసులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలి

● జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ

శావల్యాపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించి వారికి ఉత్తమ బోధనను అందించి వారిలో విద్యాసామర్థ్యాలను పెంపొందింపజేయాలని జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ అన్నారు. మండలంలోని కనమర్లపూడి సమీపంలోని సంసిద్ పాఠశాల్లో జరుగుతున్న హెచ్‌ఎంల నాయకత్వంపై రెండో విడత శిక్షణ కార్యక్రమాన్ని డీఈవో బుధవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు చిన్నతనం నుంచే ఉన్నత విద్యను అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం మోడల్ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు. గణితంలో చతుర్విధ ప్రక్రియలను అమలుచేసి సులభంగా విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలన్నారు. హెచ్‌ఎంలు ఉపాధ్యాయుల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలన్నారు. సమగ్రశిక్ష రాష్ట్ర పరిశీలకులు పుల్లటి రమేష్, డీవైఈవో సుభానీ, ఎంఏవో పూర్ణచంద్రరావు, ఎంఈవో పుసులూరి లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి: తహసీల్దార్

నాదెండ్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ వర్గాలతో పాటు ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ ఎస్.చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని కనపర్రులోని ఎస్సీ కాలనీ ప్రాంతంలో బుధవారం సాయంత్రం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గాలకు ప్రత్యేకమైన హక్కులు ఉన్నాయని, వాటిని దుర్వినియోగం చేయకుండా ఉండాలని కోరారు. ఎస్‌ఐ పుల్లారావు పౌరుల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెలుగు ప్రాజెక్టు ఏపీఎం రమేష్, వి.సింగయ్య, రాఘవయ్య పాల్గొన్నారు.

బొల్లాపల్లి ఎంఈవోగా డాక్టర్ యశోధర



యశోధరను సన్మానిస్తున్న ఎంఈవో - 2 పార్వతి

బొల్లాపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బొల్లాపల్లి మండల విద్యాశాఖ అధికారి-1గా వీ యశోధర బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె వినుకొండలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా ఆమె పని చేస్తున్నారు. రెండు రోజుల క్రితం ఆమెను ఫుల్ అడిషనల్ చార్జ్‌తో బొల్లాపల్లి ఎంఈవో-1గా నియమిస్తూ ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో యశోధర బుధవారం విధుల్లో చేరారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన ఎంఈవో జఫ్రుల్లా ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోను ఎంఈవో-2 పార్వతి, పలువురు ఉపాధ్యాయులు, ఎంఆర్‌సీలు, సిబ్బంది ఘనంగా సన్మానించారు.